విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి
ఆదివారం 13 ఏప్రిల్ 2025 8 పేజీలు

వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

సీపీఐ నిరసన

విశాలాంధ్ర -భీమవరం : రాజ్యాంగ విరుద్ధంగా కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఆమోదించిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా పార్లమెంటులో ఆమోదించడాన్ని నిరసిస్తూ సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా శనివారం భీమవరం ప్రకాశం చౌక్ లో జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన -ధర్నా నిర్వహించారు. ధర్నా నుద్దేశించి భీమారావు మాట్లాడుతూ వక్ఫ్ చట్టం దేశ ఐక్యతకు, రాజ్యాంగంలో మత స్వేచ్ఛకు తీవ్ర విఘాతమని, ప్రతిపక్షాలు సూచించిన సవరణలను పరిగణనలోకి తీసుకోకుండా వివాదాస్పద వక్ఫ్ చట్టాన్ని అర్ధరాత్రి సమయంలో మోదీ ప్రభుత్వం ఆమోదించడం దురదృష్టకరమన్నారు. మైనారిటీలను ముఖ్యంగా ముస్లిం లను లక్ష్యంగా చేసుకుని బీజేపీ దేశాన్ని మతం పేరిట విభజించేందుకు ప్రయత్నం చేస్తుందని భీమారావు దుయ్యబట్టారు. వక్ఫ్ బిల్లుపై చర్చ సమయంలో వక్ఫ్ బోర్డు డబ్బును మైనారిటీల సాధికారత కోసం వినియోగిస్తామని బీజేపీ నేతలు బూకటపు హామీలు ఇచ్చారని మరి మౌలానా ఆజాద్ స్కాలర్షిప్ పథకాల కింద మైనారిటీ విద్యార్థులకు ఇచ్చే స్కాల ర్షిప్పులు ఎందుకు ఆపేశారని భీమారావు నిలదీశారు. తిరుమలలో అన్యమతాలకు చెందిన దుకాణాలు తొలగించాలని, టిటిడి దేవస్థానంలో హిందూయేతర ఉద్యోగులను సైతం తొలగించాలంటున్న బిజెపి పరి వారం ముస్లిం లకు చెందిన వక్ఫ్ బోర్డులో హిందూ మతానికి చెందిన ఇద్దరిని వక్ఫ్ బోర్డులో సభ్యులుగా చేర్చడం వక్ఫ్ బోర్డు సీఈఓ సైతం హిందూ వుండొచ్చ నడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ముస్లిం మైనారిటీల నాయకులు ఛాన్ భాషా, షేక్ ఆషా, అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కోనా జోసెఫ్, కార్యదర్శి వి.రాజు తదితరులు మాట్లాడారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాసరావు, తిరుమాని కామేశ్వర రావు, ఎం.లక్ష్మీపతి, నాగిడి శాంతమూర్తి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.వి.ఆనంద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, చిత్తరంజన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడు: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధంగా అమలు చేసిన వక్ఫ్ సవరణ చట్టం మత స్వేచ్ఛను హరించే విధంగా ఉందని, వక్ఫ్

భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకే వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును మోడీ ఆమోదింపచేశారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళింగ లక్ష్మణరావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన వక్ఫ్ సవరణ చట్టం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం పెంటపాడు గేటు సెంటర్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులతో కలిసి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళింగ లక్ష్మణరావు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సంఘ నాయకులు,ముస్లిం మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని వక్ఫ్

▶మిగతా 2లో..

నిడదవోలు మున్సిపాలిటీ జనసేన కైవసం

విశాలాంధ్ర - నిడదవోలు : ప్రజా సంక్షేమం, అభివృద్ధి కూటమి లక్ష్యమని దానికి ఆకర్షితులైన కౌన్సిలర్లు జనసేనలో చేరడం అభినందనీయమని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖమంత్రి

▶మిగతా 2లో..

వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధం

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

విశాలాంధ్ర-ఏలూరు: వక్ఫ్ బోర్డ్ 2025 చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధమని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు ముక్తకంఠంతో బిల్లును వ్యతిరేకించారు. శనివారం స్థానిక సీపీఐ ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో వక్ఫ్ బోర్డ్ 2025 చట్ట సవరణను వ్యతిరేకిస్తూ సీపీఐ ఏలూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమా వేశం జరిగింది. ఈ సమావేశానికి విశ్రాంతి జడ్జి అడబాల లక్ష్మి అధ్యక్షత వహించారు.ఈ సమా వేశంలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ

కృష్ణ చైతన్య,కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన రావు,వైయస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పల్లి శ్రీనివాసరావు, ముస్లిం జేఏసీ కన్వీనర్ మహమ్మద్ ఇలియాస్, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు కే కృష్ణమా చార్యులు,ప్రముఖ న్యాయవాది పిపి శాస్త్రి,బి.కే.యం యు.జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులు బి. ప్రభాకరరావు, సిపిఐ నాయకులు పి.కిషోర్ తదితరులు మాట్లాడారు. కేంద్రంలో బిజెపి నాయకత్వాన 2014లో ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం గత 11 సంవత్సరాలుగా ముస్లిం మైనార్టీల పైన, క్రిస్టియన్ మైనార్టీల పైన, లౌకికవాదుల పైన,వామపక్షాలపై దాడులకు పూనుకుంటుందని పేర్కొన్నారు. అందులో భాగంగానే

▶మిగతా 2లో..

మంచినీటికి ఇబ్బంది లేకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు : ఎన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ వాటన్నింటినీ అధిగమించి ఈ ఏడాది వేసవికాలంలో నగర ప్రజలకు మంచినీటి సమస్య లేకుండా యుద్ధ ప్రాతిపాదికన చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, కమిషనర్ ఎ. భాను ప్రతాప్ అన్నారు. దెందులూరు సమీపంలోని గోదావరి జలాల సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును కో-ఆప్షన్ సభ్యులు పెదబాబు, కమిషనర్ భానుప్రతాప్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రావలసిన రోజుల్లో గోదావరి జలాలు ఏలూరు కాల్వకు రాకపోయినప్పటికీ కష్టం, ఖర్చును కూడా ఆలోచించకుండా ప్రత్యేక మోటార్లను ఏర్పాటు 24 గంటలు వాటిని రన్ చేసి నగర ప్రజలకు ఈ వేసవి కాలంలో మంచినీటి కొరత లేకుండా చూస్తామని చెప్పారు. గత సంవత్సరం నవంబర్ డిసెంబర్ నెలలో గోదావరి జలాలు ఏలూరు కాలువకు రాకపోవడం కారణంగానే సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ 16 మీటర్ల లోతు నీరు

నింపుకోలేక పోయామన్నారు. ఈ విషయాన్ని గ్రహించి నగర పాలక సంస్థ మేయర్ నూర్జహాన్ పెదబాబు ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య దృష్టికి తీసుకు వెళ్లారన్నారు. వేసవి కాలంలో ఎదురయ్యే మంచినీటి సమస్యను అర్థం చేసుకున్న ఎమ్మెల్యే బడేటి చంటి సమస్యను ఇరిగేషన్ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లడం అంతటితో ఆగకుండా అసెంబ్లీలో కూడా ఏలూరు మంచినీటి సమస్యపై ప్రస్తావించారన్నారు. దీంతో జిల్లా కలెక్టర్ రంగంలోకి దిగి త్రాగునీటికి ఇవ్వాల్సిన ప్రాధాన్యతను గుర్తిస్తూ గోదావరి జలాలు ఏలూరు కాలువ ద్వారా దెందులూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వరకు వచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. కమిషనర్ ఎ.భాను ప్రతాప్ గోదావరి జలాలు తరలించడానికి మున్సిపల్ కార్పొరేషన్‌కు ఉన్న మోటార్లకు అదనంగా 400 హెచ్ పి ఆయిల్ ఇంజన్ మోటర్లు-2, 20 హెచ్ పి మోటర్లు 10 ఏర్పాటు చేశారన్నారు. ఈ విధంగా 20 రోజులు పాటు గోదావరి కాలువ నుండి నీరును తొడగలిగితే వేసవికాలంలో నగర ప్రజలకు మంచినీటి ఇబ్బందులు లేకుండా చేయగలుగుతామని కో-ఆప్షన్ సభ్యులు పెదబాబు, కమిషనర్ భాను ప్రతాప్ అన్నారు. వీరివెంట ఎలక్ట్రికల్ ఏఈ సాంబశివరావు, కార్పొరేటర్లు దేవరకొండ శ్రీనివాసరావు, జిన్నూరు కనక నరసింహారావు, పాము శామ్యూల్ తదితరులు ఉన్నారు.

శరవేగంగా వంతెన మరమ్మతుల పనులు

విశాలాంధ్ర - పాలకోడేరు : పాలకోడేరు మండలం గొల్లల కోడేరు, నవుడూరు రోడ్డులో గల గొల్లలకోడేరులో గొంతేరు డ్రెన్‌పై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరడంతో కాంక్రీట్ పునః నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

ఇప్పటికే వంతెనపై రాకపోకలను నిలుపుదల చేసి వాహనాలను దారి మళ్లించే ప్రక్రియ చేపట్టారు. పునర్ని ర్మాణ పనులు శు క్రవారం నుండి మొదలుపెట్టారు. ఈ నెలాఖరుకు వంతెన పునః నిర్మాణ పనులు పూర్తి చేయాలని లక్ష్యంతో పనిచేస్తున్నట్లు రోడ్లు భవనాల శాఖ ఇంచార్జ్ కార్యనిర్వాహక ఇంజనీరు రామరాజు తెలిపారు.

22న సబ్బి కనకారావుకు సన్మానం

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గౌరవ అధ్యక్షులు, సీనియర్ బుర్రకథ కళాకారులు, సీనియర్ సిపిఐ నాయకులు, సబ్బి కనకారావు ఇటీవల విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఉగాది వేడుకల్లో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా కళారత్న అవార్డ్ పొందారు. ఈ సందర్భంగా కనకారావును అభినందిస్తూ.. ఈ నెల 22న లక్కవరంలో జరుగు వెంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆయనకు ఘన సన్మానం చేయనున్నట్లు ఉత్సవ కమిటీ కార్యదర్శి తడికమల్ల రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సన్మాన సభకు కళాకారులు, కవులు రచయితలు, కళాభి మానులు తప్పక హాజరు కావలసిందిగా రామకృష్ణ కోరారు.

నూరు శాతం ఫలితాలు సాధించిన ఉన్నత పాఠశాల ప్లస్ ఇంటర్ విద్యార్థులు

విశాలాంధ్ర-లింగపాలెం: ధర్మాజీగూడెం ఉన్నత బాలికల పాఠశాల ప్లస్ లో ఇంటర్ సెకండ్ ఇయర్ చదివిన విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉన్నత పాఠశాలలో ప్లస్ విధానం ప్రవేశపెట్టిన తర్వాత మొదటిసారి పరీక్షలు రాసిన బాలికలు మంచి ఫలితాలు సాధించారు. సెకండ్ ఇయర్ పరీక్షలు 5గురు వ్రాయగా వీరందరూ ఉత్తీర్ణత సాధించారు. ధర్మాజీగూడెం ఎమ్మెన్నార్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇద్దరు విద్యార్థులు సెకండ్ ఇయర్ పరీక్షల రాయగా ఒక విద్యార్థి ఉత్తీర్ణత సాధించాడు. గ్రామంలోని ప్రభుత్వ కళాశాలల్లో చదివిన ఇంటర్ విద్యార్థులు ఆశించిన ఫలితాలు సాధించడంతో కళాశాల సిబ్బంది సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్మీడియట్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఉంగుటూరు మండలం నారాయణ పురం శ్రీ మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫలితాల్లో బాలికలే ముందంజలో

ఉన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్స రంలో 118 మందికి 71 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం 62 మందికి 53 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపిసి లో లక్ష్మీ శ్రావ్య 412 మార్కులు, సీఈసీ లో దంగి జ్యోతి 454 మార్కులు, ఎంపీసీలో భానుచరణ్ 424 మార్కులు సాధించి కళాశాలలో టాపర్‌గా గెలిచారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో : బైపీసీలో హర్షిత 948 మార్కులు, సిఈసిలో ప్రశాంతి 947 మార్కులు, ఎంపీసీలో విజయరాజు 940 మార్కులు సాధించి ఆయా గ్రూపులో టాపర్ గా నిలిచారు.

జనసేన కైవసం

(1వ పేజీ తరువాయి)

కందుల దుర్గేష్ అన్నారు. జనసేన తీర్థం పుచ్చుకున్న 13మంది వైసీపీ కౌన్సిలర్లు, టీడీపీ,ఎక్స్ అఫిషియోతో కలిపి 15కు చేరడంతో నిడదవోలు మున్సిపాలిటీని జనసేన కైవసం చేసుకుంది. దాంతోమున్సిపల్ చైర్మన్‌పై వైసీపీ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగి పోగా గత కొంతకాలంగా సాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. రాష్ట్రంలో జనసేన పార్టీ ఖాతాలో ఏర్పడిన తొలి మున్సిపాలిటీగా నిడదవోలు నిలిచింది. నిడదవోలులో మొత్తం 28 కౌన్సిలర్లకు జనసేన పార్టీకి ఒక్క కౌన్సిలర్ కూడా లేరు. గడిచిన ఎన్నికల్లో వైసీపీ 27 స్థానాల్లో విజయం సాధించగా, టీడీపీ ఒక్క స్థానంలో గెలిచింది. దీంతో వన్ సైడ్ గా వైసిపి ఈ మున్సిపాలిటీని సొంతం చేసుకుంది. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో పాలకులు మారారు, పాలన మారింది. నియోజకవర్గంలో కూటమి ఎమ్మెల్యేగా గెలు పొంది జనసేన నేత కందుల దుర్గేష్ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించ డంతో జరిగిన అభివృద్ధి సంక్షేమ పట్ల ఆకర్షితులై కౌన్సిలర్లు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. తొలుత చైర్మన్, వైస్ చైర్మన్ తో పాటు మరో 11 మంది వైసీపీ సభ్యులు జనసేనలో చేరిపోయారు. దీంతో 13 మంది కౌన్సిలర్లు జనసేన పార్టీకి ఏర్పడ్డారు. కూటమి భాగస్వామ్యంలో ఉన్న టీడీపి కౌన్సిలర్ ని కలుపుకుంటే 14 మంది బలం ఇక్కడ జనసేనకు చేరింది. మంత్రిగా ఉన్న దుర్గేష్ ఎక్స్ అఫిషియో మెంబర్ ఓటు హక్కు ఉండటంతో ఆ బలం 15కి పెరిగింది. ఏప్రిల్ 3న మునిసిపల్ చైర్మన్‌పై అవిశ్వాసానికి తీర్మానం పెట్టాలంటూ వైసీపీ కౌన్సిలర్లు ఆర్డీవో, కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు, ఇంతలోనే మరి కొంతమంది జనసేనలో చేరడంతో వారికి అవిశ్వాస తీర్మానానికి తగ్గ బలం సరిపడని పరిస్థితి ఏర్పడింది. దీంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. ఈ క్రమంలో జనసేన పార్టీ ఇక్కడి చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంది.

ఈ సందర్భంగా చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, పలువురు కౌన్సిలర్లకు జనసేన కండువా కప్పి ఘనంగా సత్కరించారు. తమకు సహకరించిన కౌన్సిలర్లకు చైర్మన్ భూపతి ఆదినారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

ఉపసంహరించుకోవాలి

(1వ పేజీ తరువాయి)

చట్ట సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని నినాదాలు చేశారు. వీరికి మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు తమ మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా కళింగ లక్ష్మణరావు, సీఎం. మంగరాజు, పెంటపాడు ముస్లిం సంఘం అధ్యక్షులు షేక్ అబ్దుల్లా,ఉపాధ్యక్షులు షేక్ అసేన్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేసిన వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగానికి విరుద్ధమని అన్నారు. ముస్లిం ప్రజల అభ్యున్నతి కోసం ప్రార్థనా మందిరాల కోసం కేటాయించిన లక్షలాది ఎకరాల వక్ఫ్ భూములను కూడా కార్పొరేట్లకు కట్టబెట్టడా నికి వక్ఫ్ ఓటు చట్ట సవరణ బిల్లును రాజ్యసభలో దుర్మార్గంగా ఆమోదింపచేసిన మోడీ ప్రభుత్వం,ముస్లిం సమాజాన్ని తీవ్రమైన మానసిక క్షోభకు గురిచేసిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వంకాఅప్పారావు,దిద్దే నాగేశ్వర రావు, కొణతాల నాగరాజు, మాల మహానాడు నాయకులు ఉన్నట్ల ఏసురత్నం,ముస్లిం సంఘ నాయకులు ఇస్మాయిల్,షేక్ బాజీ, షేక్ హుస్సేన్,షేక్ మస్తాన్, షేక్ రజియా బీ, షేక్ షహీదాబీ,షేక్ ఫాతిమాబీ, షేక్ లాల్ బీ తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరు: వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ సీపీఐ కుక్కు నూరు మండల సమితి ఆధ్వర్యంలో ఆందో ళన చేపట్టారు. పెద్ద సంఖ్యలో ముస్లింలు

మద్దతు తెలుపుతూ కుక్కునూరు ప్రధాన రహదారిపై ఆందోళన నిర్వహించారు .దీంతో వాహనాల రాకపోకలు కొద్దిసేపు నిలిచాయి. ఈ సందర్భంగా వెంకటాచారి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముస్లిం మైనార్టీలపై అనేక రకాలుగా దాడులు జరుగుతున్నాయని అన్నారు. ఆ క్రమంలోనే వక్ఫ్ చట్ట సవరణ బిల్లును తెర మీదకు తీసుకువచ్చిందన్నారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం అని ప్రపంచానికి చాటిన ప్రజల మధ్య మతోన్మాద పార్టీలు చిచ్చు పెట్టడం దారుణమన్నారు. కుకునూరు వైకాపా నాయకులు కూడా సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఐ ఏలూరు జిల్లా సమితి సభ్యులు కొన్నె లక్ష్మయ్య, కూరాకుల బాబూరావు, నకిరికంటి నాగరాజు, ముస్లిం పెద్దలు ఎస్కే చాంద్ పాషా, ఎండీ.ఉస్మాన్,ఖాదర్ బాబా, కరిముల్లా, ఖాసిం సాహెబ్, ఖాజీ నయీం,తారీక్ అన్వర్, అఖిల్ పాషా,వైకాపా నాయకులు కుచ్చర్లపాటి. చిన నరసింహరాజు, రాయి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి: వక్ఫ్‌బోర్డ్ సవరణ 2025 అమలును నిలిపివేయాలని సిపిఐ మండల కార్యదర్శి తోర్లపాటి బాబు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చింతలపూడిలో వక్ఫ్‌బోర్డ్ 2025 ప్రతులను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా తోర్లపాటి బాబు మాట్లాడుతూ 2014లో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం ఆనాటి నుంచి ఈనాటి వరకు ముస్లిం మైనార్టీల హక్కులను కాలరాస్తూ వీరిపై దాడులు చేస్తూ లౌకికవాదాన్ని అణచివేస్తూ రాజ్యాంగ హక్కులను కాలరాస్తుందని అన్నారు. దానిలో భాగమే వక్ఫ్‌బోర్డ్ సవరణ చట్టం 2025 అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి దంతా కృష్ణ, కమిటీ సభ్యులు ఎస్కే కాలేషా, మోర్త లక్ష్మణరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో చాణక్య కాలేజీ విజయభేరి

విశాలాంధ్ర - గణపవరం: శనివారం ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలను ఇంటర్మీ డియట్ బోర్డ్ విడుదల చేసింది. గణపవరం చాణక్య జూనియర్ కళాశాల ఫస్ట్ ఇయర్, సెకండ్

ఇయర్ విద్యార్థులు స్టేట్ థర్డ్ ర్యాంక్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ అడబాల శ్రీనివాసరావు (సూరిబాబు) శనివారం తెలిపారు. ఐదు మండలాల్లో గణపవరం చాణక్య కాలేజ్ విద్యార్థులు మొదటి స్థానం సాధించారని తెలిపారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థి బొబ్బిలి పార్వతి 1000/986 మార్కులు సాధించి స్టేట్ థర్డ్ ర్యాంక్ లో నిలిచిందని, మొదటి సంవత్సరం చదువుతున్న పుష్పాల భవాని 470/463 మార్కులు సాధించి స్టేట్ థర్డ్ ర్యాంక్ సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన అధ్యాపక బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బొర్రంపాలెంలో చలివేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర-టి నరసాపురం: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు సామాజిక కార్యకర్త గుండె పాండు రంగ తెలిపారు. బొర్రం పాలెం గ్రామంలోని ప్రధాన సెంటర్ లో స్వచ్ఛ సేవా చారిటబుల్ ట్రస్ట్ అధినేత పెండ్యాల అభిషేక్ బాబు ఆర్థిక సహాయంతో శనివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసారు.

ఈ సందర్భంగా పాండు రంగ మాట్లాడుతూ స్వచ్ఛ సేవా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అభిషేక్ బాబు యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం రూరల్ : నైపుణ్యాభివృద్ధి కలిగిన ఉపాధ్యాయులతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉన్నత విద్య అందిస్తున్నా మని జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణ అన్నారు. శనివారం నవాబు పాలెంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన పరిశీలన చేశారు. రీ జాయినింగ్ అయిన విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. గ్రామంలోని ప్రాథమికఉన్నత పాఠశాలను, జిల్లా పరిషత్ ఉన్నత

పాఠశాలగా మార్చేందుకు అన్ని సౌకర్యాలు ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు సామర్థ్యాలు, పరీక్షల నిర్వహణ, మధ్యాహ్నం భోజనం అమలు, శానిటేషన్, మరుగుదొడ్ల పనితీరు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డిఈఓ నారాయణ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలలలో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా, నైపుణ్యం గల ఉపాధ్యాయులతో ఉన్నత విద్యను అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వి. హనుమ, గ్రామ నాయకులు మద్దుకూరి ధనరాజు, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

విరుద్ధం (1వ పేజీ తరువాయి)

ముస్లింల హక్కులకు భంగం కల్పిస్తూ రాజ్యాంగ విరుద్ధంగా 2025 వక్ఫ్ చట్ట సవరణ బిల్లును పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదించి కేంద్ర ప్రభుత్వం అమలుకు సిద్ధమైందని తెలిపారు. ప్రభుత్వ చర్యను నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. వక్ఫ్ చట్టంలో పలు అంశాలు ముస్లిం ప్రజల ఆస్తులను కొల్లగొట్టేవిగా ఉన్నాయని విమర్శించారు. పథకం ప్రకారం ముస్లింల ధార్మిక, సామాజిక సాంస్కృతిక సంస్థలపై దాడి చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డ్ 2025 చట్ట సవరణ బిల్లు రద్దు అయ్యేవరకు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నాయకులు నిర్ణయించారు. సీపీఐ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ముస్లిం జేఏసీ నాయకులు సయ్యద్ బాజీ, సిపిఐ,ఏఐటీయూసీ నాయకులు కురెళ్ళ వరప్రసాద్, కడుపు కన్నయ్య, ఎంఏ హాకీమ్,మావూరి విజయ,భజంత్రి శ్రీనివాసరావు, బుగత జగన్నాథరావు, యర్రా వెంకటేశ్వర్లు,జి స్వాతి,కె. సుధారాణి, బుగ్గల ప్రభాకర్, ఎ. యోహాన్, యు లక్ష్మి, భవాని, భాగ్యలక్ష్మి, ఉషా, కే జగన్, ఎ. త్రిమూర్తి, మద్దాల ఫణి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి : ఏపీయూడబ్ల్యూజే

విశాలాంధ్ర -భీమవరం: పల్నాడు జిల్లా మాచర్లలో జరిగిన హత్య కథనం ప్రచురించిన సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి, మరొక ఆరుగురు విలేకర్లపై పెట్టిన అక్రమ కేసులకు వ్యతిరేకంగా శనివారం భీమవరంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, భీమవరం ఏరియా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిరసన

కార్యక్రమం నిర్వహించారు. ముందుగా డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఆర్.జి.జయసూర్యకు వినతిపత్రం అందించారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు వి.ఎస్.సాయిబాబా, రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రంశెట్టి గిరిజాపతి మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను కాపాడాలని రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు అరికట్టాలని డిమాండ్ చేశారు. సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి, విలేకర్లపై పెట్టిన అక్రమ కేసులను తక్షణం ఉపసంహరించు కోవాలన్నారు. ఎన్టీవి రిపోర్టర్ బోనం శ్రీనివాస రావు,10 టీవీ రిపోర్టర్ అల్లూరి అరుణకుమార్ మాట్లాడుతూ రాజ్యాంగంలో ఆర్టికల్ 19 (1) ప్రకారం భావ ప్రకటన స్వేచ్ఛ ప్రతి ఒక్కరికి ఉందని ప్రభుత్వాలను ప్రశ్నించే జర్నలిస్టులపై కేసులు పెట్టడం అన్యాయ మన్నారు. సాక్షి ఎడిటర్, ఆరుగురు పాత్రికేయులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెస్ క్లబ్ కార్యదర్శి కమ్మిల హనుమంతరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కేవీఎస్ఆర్ గోపాలకృష్ణ, ఆరేటి శ్రీనివాస్, బోణం శ్రీను, సాక్షి, రవి, ఆంధ్రజ్యోతి రాజాబాబు, విసివి అయ్యప్ప, సాక్షి స్టాఫ్ రిపోర్టర్ విజయ్, సాక్షి భీమవరం రూరల్ రిపోర్టర్ నాగరాజు, అల్లూరి అరుణ్, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ శారద కళాశాల విద్యార్థినికి రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు

విశాలాంధ్ర -నూజివీడు : శనివారం ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో నూజివీడు శ్రీ శారద కళాశాల విద్యార్థిని కే. దేదీప్య సాయి సీనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో 991 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు పొందినట్లు కళాశాల చైర్మన్ కె. శంకరరావు తెలిపారు. శనివారం నూజివీడు శారద కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ

కళాశాలలో ఇంటర్మీడియట్ బైపీసీ విభాగంలో కే. దేదీప్య సాయి 991 మార్కులతో రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకు సాధించడంతో పాటు తమ విద్యార్థులు ఎస్. హేమశ్రీ 981, పి. హరిప్రియ 976 మార్కులతో నూజివీడు డివిజన్ స్థాయిలో రెండు, మూడు ర్యాంకులను సాధించినట్లు తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 970 పైన మార్కులను ఏడుగురు విద్యార్థులు సాధించినట్లు పేర్కొన్నారు. జూనియర్ బైపీసీలో పి.లాలిత్య 430 మార్కులతో డివిజన్ స్థాయి రెండో ర్యాంకు సాధించగా ఎస్.హాసిని 428 మార్కులతో డివిజన్ మూడవ ర్యాంకును, ఆర్.సిరివల్లి 420 మార్కులతో డివిజన్ స్థాయి నాలుగో ర్యాంకును సాధించినట్లు తెలిపారు. అలాగే జూనియర్ ఎంపీసీలో నూజివీడు పట్టణస్థాయి మొదటి, రెండు ర్యాంకులు తమ కళాశాల విద్యార్థులు సాధించినట్లు ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో నీట్ మరియు ఏపీసెట్లో కూడా మెరుగైన ర్యాంకులు సాధిస్తామని కళాశాల డైరెక్టర్ కె శంకర్రావు తెలియజేశారు. తమ విద్యార్థులు సాధించిన విజయానికి తోడ్పాటున అందించిన ఉపాధ్యాయులకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ సమావేశంలో కళాశాల కరస్పాండెంట్ జి.రాధిక, ఇతర ఉపాధ్యాయులు,ర్యాంకులు సాధించిన విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల విజయం

విశాలాంధ్ర - గణపవరం: శనివారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో గణపవరం శ్రీ చింతలపాటి బాపిరాజు ప్రభుత్వ జూనియర్ కళాశాల లో సెకండ్ ఇయర్ 68 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 51 75% మంది విద్యార్థులు ఉత్తీర్ణత అయినట్లు కళాశాల ప్రిన్సిపల్ చిట్టి బొమ్మ శ్రీనివాస్ గౌడ్ శనివారం తెలిపారు. వీరిలో సిఇసి గ్రూప్ లో చదువుతున్న బి. భవ్యశ్రీ 1000/894 మార్క్స్ సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందని ఆయన తెలిపారు. ఎంపీసీ గ్రూప్ లో చదువుతున్న, బి.జ్యోతివర లక్ష్మి 1000/840 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచిందని, ఎం పి హెచ్ డబ్ల్యు గ్రూప్ లో చదువుచున్న సరిపల్లి శిరీష కు 1000/840 మార్క్స్ సాధించి తృతీయ స్థానం దక్కించుకున్నారు. ఇంటర్ మీడియేట్ ఫస్ట్ ఇయర్ 74 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరు కాగా 51మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఆయన తెలిపారు.

సీపీఐ నాయకులు నాగేశ్వరరావు మృతి

విశాలాంధ్ర-పెనుమంట్ర: మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం వర్కర్స్ యూనియన్ నాయకులు, సీపీఐ శేషమ్మ చెరువు గ్రామశాఖా కార్యదర్శి జక్కం శెట్టి నాగేశ్వరరావు (68) అనారోగ్యంతో గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇరువురు కుమార్తెలు వున్నారు.జక్కంశెట్టి నాగేశ్వరరావు మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో టైం స్కేల్ వర్కర్ గా విధులు నిర్వహించి రిటైర్డ్ అయ్యారు. వ్యవసాయ పరిశోధనా కేంద్రం కార్మిక సంఘం కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసారు. ఏఐటీయూసీ తణుకు ఏరియా ఉపాధ్యక్షునిగా, జిల్లా సమితి సభ్యునిగా, సీపీఐ తణుకు ఏరియా కమిటీ సభ్యునిగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన స్వగ్రామం ఆచంట మండలం శేషమ్మచెరువు సీపీఐ గ్రామ శాఖా కార్యదర్శిగా వున్నారు.సీపీఐ పట్ల పూర్తి అంకితభావంతో గ్రామంలో రాజకీయంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా మొక్కవోని దీక్షతో ధైర్యంగా ఎదుర్కొని సీపీఐ నాయకునిగా కొనసాగుతున్నారు. గ్రామంలో అనేక రాజకీయ పరమైన సమస్యలు ఎదురైన సందర్భంలో సీపీఐ నేతలు వంక సత్యనారాయణ, తమ్మినీడి సుబ్బారావు సహకారంతో పార్టీ వీడకుండా ధైర్యంగా నిలబడ్డారు. గ్రామంలో ఎన్నో ఘర్షణలు, పోలీసు కేసులు ఎదుర్కొని పార్టీ కోసం నిలబడిన వ్యక్తి నాగేశ్వరరావు. మార్టేరు అగ్రికల్చరల్ యూనివర్సిటీ వరి పరిశోధనా కేంద్రంలో పనిచేస్తున్న కార్మికులను టైం స్కేల్ వర్కర్స్ గా గుర్తించడంలో, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయించడంలో నాగేశ్వరరావు ఎనలేని కృషి చేసారు. యూనివర్సిటీ వరిపరిశోధనా

కేంద్రంలో కాంట్రాక్టు కార్మికులు హక్కుల సాధనకు యూనియన్ అధ్యక్షుడు కోనాల భీమారావుతో కలసి అనేక ఉద్యమాలు,పోరాటాలు నిర్వహించారు. జీవితాంతం కార్మికులు అభ్యున్నతికి, పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేసారు.

జక్కంశెట్టి నాగేశ్వరరావు మృతికి సీపీఐ సంతాపం

సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు జక్కంశెట్టి నాగేశ్వరరావు మృతికి సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు తీవ్ర సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసారు. జక్కంశెట్టి అంకితభావంతో పార్టీ అభివృద్ధికి, కార్మిక సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారని ఆయన మృతి పార్టీకి, కార్మికోద్య మానికి తీరని లోటని పేర్కొంటూ నివాళులర్పించారు. సీపీఐ ఆచంట మండల కార్యదర్శి సెలా పూర్ణ చంద్ర జోషి, ఆచంట మండల సీపీఐ నాయకులు జక్కంశెట్టి సీతారామయ్య, పెద్దిరాజు తదితరులు నాగేశ్వరరావు మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియలు ఈనెల 13 వ తేదీ ఆదివారం శేషమ్మచెరువు గ్రామంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సురేష్‌కుమార్ మృతి మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌కు తీరనిలోటు

విశాలాంధ్ర-ఏలూరు: పారిశుధ్య కార్మికుడు ఏ.పి. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు నగర సమితి సభ్యుడు ఎర్రం శెట్టి సురేష్ కుమార్ అనారోగ్యంతో మృతి చెందడం బాధాకర మని, ఆయన మృతి మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌కు తీరని లోటని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస రావు సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి యర్రం శెట్టి సురేష్ కుమార్ మృతి చెందిన వార్త సమాచారం అందగానే ఆయన గృహానికి వెళ్లి పార్థివ దేహంపై ఏఐటీయూసీ పతాకాన్ని కప్పారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, సంతాపం వ్యక్తం చేశారు. సురేష్ కుమార్ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు నగర సమితి సభ్యులు కసింకోట నాగేంద్ర, అంతరాజు కిరణ్,

ఫెదారి వంశీ, డి.రవీంద్ర, భాస్కర రావు, అల్లం పెద్దిరాజు, ధనియాల సతీష్, గూడువు దుర్గారావు, బండి సతీష్, మరియదాసు తదితరులు సురేష్ కుమార్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు.

దివ్యాంగులకు మూడు చక్రాల సైకిలు పంపిణీ

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఉంగుటూరు మండలం నారాయణపురం లయన్స్ క్లబ్ ఆడిటోరియంను జిల్లా లయన్స్ గవర్నర్ కాకరాల వేణుబాబు శనివారం అధికార సందర్శన చేశారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

చేబ్రోలు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయితీ సిబ్బంది కి నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కైకరానికి చెందిన అబ్దుల్ ఖాదిర్ అనే దివ్యాంగులకు మూడు చక్రాల

సైకిల్ అందజేశారు. అనంతరం జిల్లా గవర్నర్ క్లబ్ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు లయన్స్ క్లబ్ అధ్యక్షులు ప్రకాష్, కార్యదర్శి పాతూరి వంశీ కృష్ణ, లయన్స్ సభ్యులు గుణ్ణం బులెబ్బాయ్, శరణాల మాలతీ రాణి, శీతాల, బొమ్మిడి అప్పారావు, పుప్పాల గోపి, అడపా శోభా రాణి, రామిరెడ్డి వెంకటరెడ్డి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ ఇంటర్ పరీక్షల్లో 86 శాతం ఉత్తీర్ణత : ఆర్ఐవో కె. యోహాను

విశాలాంధ్ర-ఏలూరు: గత నెలలో జిల్లా వ్యాప్తంగా 55 సెంటర్లలో జరిగిన సీనియర్ ఇంటర్మీడియట్ పరీక్షలలో ఏలూరు జిల్లా విద్యార్థులు 86 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 9వ స్థానంలో నిలిచారు. ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కే .యోహాను పరీక్ష ఫలితాల వివరాలను తెలియజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.సీనియర్ ఇంటర్మీడియట్‌లో జిల్లా వ్యాప్తంగా 12,086 మంది విద్యార్థులు హాజరు

కాగా10, 376 మంది పాస్ కాగా 1,710 మంది ఫెయిలయ్యారు. సీనియర్ ఇంటర్ మీడియట్ పరీక్షల్లో ఏలూరు జిల్లా 86 శాతం సాధించగా, రాష్ట్ర మొత్తం మీద 83 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.జూనియర్ ఇంటర్మీడియట్ లో ఏలూరు జిల్లాలో 15,288 మంది హాజరుకాగా 10,842 మంది పాసయ్యారు.4, 446 మంది ఫెయిల్ అయ్యారు. జూనియర్ ఇంటర్మీడియట్ లో ఏలూరు జిల్లా విద్యార్థులు 71 శాతం మంది ఉత్తీర్ణులై రాష్ట్రంలో 10వ స్థానంలో నిలిచారు. జూనియర్ ఇంటర్మీడియట్ లో రాష్ట్ర వ్యాప్తంగా 70 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు మే 12 నుంచి 20 వరకు రెండు పూటలా జరుగుతాయి.ఈనెల 22లోగా పరీక్ష ఫీజులు చెల్లించాలి. రీవాల్యుయేషన్ కు 1300 రూపాయలు, రీకౌంటింగ్ కు 260 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. రీవాల్యుయేషన్, రీకౌంటింగ్ నకు ఈ నెల 13 నుంచి 22 వరకు గడువు ఉందని ఆర్ ఐ ఓ యోహాను తెలిపారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర- ఉంగుటూరు: కూటమి ప్రభుత్వం 10 నెలల్లో 100 మంది లబ్ది దారులకు రూ.1కోటి 15 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం ఉంగుటూరు ఎమ్మెల్యే క్యాంపు

కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గంలో నాలుగు మండలాలలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను 25 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యల కారణంగా చికిత్స చేయించుకుని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పలువురుకి ముందస్తు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరయ్యేలా ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

విశాలాంధ్ర- ఉంగుటూరు: ఉంగుటూరు మండలం కైకరం జాతీయ రహదారి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. దీనికి సంబంధించిన వివరాలు ఎలా ఉన్నాయి. భీమవారానికి చెందిన సందీప్, రమేష్ కైకరంలో నిర్మిస్తున్న పెట్రోల్

బంకులో పనిచేస్తున్నారు. వీరు సామాన్ల కోసం కైకరం ఊర్లోకి వచ్చి తిరిగి వెళుతుండగా వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సందీప్, రమేష్ లు గాయపడ్డారు. గాయపడిన వారిని 108 వాహనంలో ఏలూరు ఆశ్రమ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు హైదరాబాద్ నుంచి తణుకు వెళుతుంది. ఆ కారు ఆగకుండా వెళ్లిపోవడంతో స్థానికులు వెంబడించి ఉంగుటూరు టోల్గేట్ దగ్గర పట్టుకున్నారు. కారు యజమాని కండ్రైవర్ కుమార్ తణుకు కు చెందినవారు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీసాయి, శ్రీ ప్రతిభ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-లింగపాలెం: ధర్మాజీగూడెంలోని శ్రీ సాయి,శ్రీప్రతిభ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్లో 78 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ రెండు కళాశాలలో ఒకే యాజ మాన్యం పరిధిలో నిర్వహిస్తు న్నారు. ఈ కళాశాలలో 162 మంది సెకండ్ ఇయర్ విద్యార్థుల పరీక్షలు

రాయగా126 మంది ఉత్తీర్ణత సాధించారు. సెకండ్ ఇయర్ ఎంపీసీలో ఏ.సునీత 978 మార్కులు సాధించగా, సెకండ్ ఇయర్ ఎంపీసీ చెందిన మరో విద్యార్థిని యు. మేఘన 971 మార్కులు సాధించింది.ఈ కళాశాలలో ఫస్ట్ ఇయర్ ఇంటర్లో 74 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్ట్ ఇయర్ ఫలితాలలో వి. జాహ్నవి 470 మార్కులకు గాను 457 మార్కులు సాధించింది.అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను కళాశాలల డైరెక్టర్ సుజాత కుమారి, కరస్పాండెంట్ కె. నరసింహారావు, అధ్యాపకులు అభినందించారు.

ఐఎన్‌టిఎస్ఓ సెకండ్ లెవెల్‌లో సత్తా చాటిన శ్రీచైతన్య విద్యార్థులు

విశాలాంధ్ర- చింతలపూడి: చింతలపూడి శ్రీ చైతన్య విద్యార్థులు ఐ. ఎన్ .టి .ఎస్. ఓ .సెకండ్ లెవెల్ లో అత్యుత్తమ ప్రతిభ చూపించారని పాఠశాల ప్రిన్సిపాల్ టి.సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 249 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ చాటారని, వీరిలో మొదటి బహుమతిగా 6వ తరగతికి చెందిన సయ్యద్ జోయా మాన్వా ట్యాబ్ గెలుచుకుందని, రెండవ బహుమతిగా స్మార్ట్ వాచ్ గెలుచుకున్నవారు సి5 క్లైలాష్ , ఏడవ తరగతికి చెందిన అడపా రేణుక ఇంకా ముగ్గురు మూడవ బహుమతి, నలుగురు నాలుగవ బహుమతి, నలుగురు ఐదవ బహుమతి, 8 మంది ప్రత్యేక బహుమతులు, 93 మంది కన్సలేషన్ బహుమతులు, 26 మంది గోల్డ్ మెడల్స్, 108 మంది గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్స్ అందుకున్నారని ప్రిన్సిపల్ సురేష్ తెలిపారు. విద్యార్థుల సన్మాన సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక ఎం.ఈ.ఓ ఎస్. కిరణ్ కుమార్ విద్యార్థులకు బహుమతులు అందజేస్తూ విద్యార్థులలో నిగూఢమైన ప్రతిభను వెలికి తీసి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్న శ్రీచైతన్య సంస్థల విద్యా ప్రణాళికను, యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను, ప్రశంసించారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన స్టేట్ అబ్జర్వర్

విశాలాంధ్ర- పాలకోడేరు : సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర జడ్పీహెచ్ఎస్ పాలకోడేరును స్టేట్ అబ్జర్వర్ ఇస్మాయిల్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా సాక్ పాయింట్ ,రూమ్స్ అన్ని నిశితంగా పరిశీలించి సిఆర్ఎంటిలు మరియు పిటిఐ

లకు స్టాక్ ను ఎలా రిసీవ్ చేసుకోవాలో డిస్ట్రిబ్యూషన్ ఎలా చేయాలో సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి స్కూల్లో ఉన్న స్టాక్ కి రిజిస్టర్ లో ఉన్న స్టాక్ కి వ్యత్యాసాలు ఉండరాదని వచ్చిన స్టాక్ ని సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పాలకోడేరు ఎంఈఓ వన్ ఎంఈఓ 2, సీఎంఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా కలప తరలిస్తే చర్యలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : అధికారుల అనుమతి లేకుండా మారిజాతి పుల్లను తరలిస్తే చర్యలు తీసుకుంటా మని కన్నాపురం ఫారెస్ట్ సెక్షన్ అధికారి బి. దినేష్ తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ప్రతిపాడు నుండి కొయ్యలగూడెం వస్తున్న మారిజాతి పుల్ల లారీని, అదుపులోకి తీసుకుని కన్నాపురం రేంజ్ కార్యాలయానికి తరలించడం జరిగిందని తెలిపారు. ఈ పుల్ల విలువ 25000 వేల రూపాయలు ఉంటుందని దినేష్ పేర్కొన్నారు. ఈయనతోపాటు పి ఆర్ గూడెం బీట్ అధికారి నవతేజ ఉన్నారు.

చిరుద్యోగులపై కూటమి నాయకుల వేధింపులు

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: మండలంలో పొంగుటూరు గ్రామంలో డ్వాక్రా సీఏ గా 2019 వ సంవత్సరం నుండి పనిచేస్తున్న కె. విజయభారతిని విధుల నుండి తప్పుకోమని, తమ పార్టీకి సంబంధించిన వారిని సిఏగా చేర్చుకుంటామని గ్రామానికి చెందిన కూటమి ప్రభుత్వ నాయకులు బెదిరింపు లకు గురి చేస్తున్నారని ఆమె విలేకరులకు తెలిపింది.కూటమి పార్టీకి చెందిన శ్యామలరావు ఎన్ఆర్ ఈజీఎస్ లో 2008వ సంవత్సరం నుండి ఫీల్డ్ అసిస్టెంట్ గా కొనసాగుతున్నాని, ఇటీవల కాలంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి గ్రామానికి చెందిన పార్టీల నాయకులు, తనను మానసికంగా వేధింపులకు గురి చేస్తూ ఫీల్డ్ అసిస్టెంట్‌గా తనన్ను తీసివేసి, మాకు కావలసిన వ్యక్తిని విధుల్లోకి చేర్పిస్తామని బెదిరిస్తున్నారని కోనపాము శ్యామలరావు అన్నారు. అదే గ్రామానికి చెందిన కైకవరపు గోపి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నైట్ వాచ్మెన్‌గా కొనసాగుతున్నారు. గోపి బీఈడీ చేసిన ఒక నిరుద్యోగి, రిజర్వేషన్ లేకపోవడంతో బీఈడీ చేసినప్పటికీ ఉద్యోగం రాక, పాఠశాలలో నైట్ వాచ్మెన్ గా 2000 రూపాయల జీతానికి పనిచేస్తు న్నారు. వీరి ముగ్గురు దళిత జాతికి చెందినవారే, గ్రామంలో కూటమి పార్టీల నాయకులు తమను వేధింపులకు గురి చేస్తూ ఉద్యోగాలకు రాజీ నామాలు చేయాలని ఒత్తిడి

తెస్తున్నారని, కన్నీరు మున్నీర య్యారు. మండలంలో రాజవరం, ఎర్రంపేట, కుంతల గూడెం, గవరవరం గ్రామాలలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లను కూడా తొలగించి కూటమి ప్రభుత్వ నాయకులు వారికి సంబంధించిన వారిని నియమించుకున్నారు. ఇవి ప్రభుత్వ ఉద్యోగాల లేక పార్టీ నాయకులు నడిపించే ఉద్యోగాల అని సందేహంతో ప్రజలు వాపోతు న్నారు. ఒకరు తింటున్న భోజనం ప్లేట్లు బలవంతంగా లాక్కొని, వేరొకరికి పెట్టడమేనా అని గ్రామానికి చెందిన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిరు ఉద్యోగాలు చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించు కుంటున్నామని, తమను ఈ ఉద్యోగాలలో నుండి తప్పిస్తే తమ కుటుంబాలు రోడ్డున పడతా యని తమ సమస్యను సంబంధిత అధికా రులు పరిష్కరించాలని కోరారు.

రూ.14 కోట్లతో గోడ నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - పాలకొల్లు : రూ.14 కోట్లతో మూడు వేర్వేరు ప్రదేశాల్లో చేపట్టే దమయపర్తి మురుగు డ్రైన్ కాంక్రీట్ గోడ నిర్మాణ పనులకు మంత్రి రామానాయుడు శంకుస్థాపన చేశారు. దొడ్డిపట్ల రోడ్డు సెంట్ మేరీస్ , పదో వార్డు, నాలుగో వార్డుల్లో జరిగిన శంకుస్థాపన కార్యక్రమాల్లో కూటమి నాయకులతో కలిసి మంత్రి నిమ్మల రామానాయుడు పూజ జరిపి కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా మంత్రికి ఆయా ప్రాంతాల ప్రజలు ఘన స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు. పెద్ద సంఖ్యలో మహిళలు హారతులు ఇచ్చి దీవించారు. 9 నెలలలోనే ఇచ్చిన మాట

నిలబెట్టుకుంటున్న మంత్రి రామానాయుడు నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు ఇచ్చారు డ్రైన్ పై చేపట్టబోయే పనులను మంత్రి రామానాయుడు పరిశీలించారు. పనులకు ఆటంకం లేకుండా డ్రైన్ వెంబడి గ్రావెల్ రహదారి నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ముఖ్య టిడిపి నాయకులు అధికారులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పెంటపాడు మండలంలో జిల్లా విద్యాశాఖాధికారి పర్యటన

విశాలాంధ్ర-పెంటపాడు : మండలం లోని ఎంపీపీ నెం-1, మరియు ప్రతిపాడు పాఠశాలలను పశ్చిమ గోదావరి జిల్లా విద్యాశాఖ అధికారి విపిఎస్ఎస్ బిఎల్ నారాయణ శనివారం మండల విద్యాశాఖ అధికారి-2 టీవీ.రామ కృష్ణ తో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ తనిఖీలో భాగంగా విద్యార్థుల పుస్తకాలు, విద్యా ప్రమా ణాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్వాడీ సెంటర్‌ను కూడా తనిఖీ చేశారు. అంగన్వాడీ నందలి 5 సంవత్స రాలు నిండిన పిల్లలను మన ప్రభుత్వ పాఠశా లల్లో మాత్రమే చేర్పేలా అందరూ కృషి చేయాలని సూచించారు.

పాస్‌పోర్టు పోయినది

శీలం సందీప్ S/o శీలం ప్రదీప్ కుమార్, డోర్.నెం. 17-27-9, వైనాట్ షోరూం వెనుక, వేమవరం, తణుకు, పశ్చిమగోదావరిజిల్లా., నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు S3804215 ను రెన్యువల్ చేయునిమిత్తం ది.02.04.2025వ తేదిన భీమవరం వెళ్లి పోలీసు బొమ్మ సెంటర్ వద్ద వున్న హోటల్లో టిఫిన్ చేయుటకు వెళ్లగా మోటార్ సైకిల్ ట్యాంక్ కవరులో పెట్టిన నా ఒరిజినల్ పాస్‌పోర్టుగల కవరు మార్గ మధ్యంలో పోయినది.ఎంత వెదికినను దొరకలేదు. కావున ఎవరికైనను దొరికిన ఎడల పైన తెలిపిన చిరునామాకు అందచేయగలరు.

ట్రిపుల్ ఐటీలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర- నూజివీడు : ఆర్జీయూకేటీ నూజివీడులో క్యాంపస్ మెయింటినెన్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీకర హాస్పటల్ విజయవాడకు చెందిన ఆసుపత్రి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గుండె, లివర్, గ్యాస్ట్రిక్, గైనకాలజీ విభాగాలకు సంబంధించిన ప్రసిద్ధమైన టువంటి వైద్యులు విచ్చేసి పరీక్ష నిర్వహించి సలహాలు,

సూచనలు, ఉచితంగా మందులు అందజేశారు. ఇందులో భాగంగా డైరెక్టర్ అమరేంద్ర కుమార్ వచ్చిన వైద్య బృందంతో చర్చించి, ఆర్జీయూకేటీ క్లినిక్ లో స్థాపించాల్సిన మౌలిక సదుపాయాలు, ముఖ్యంగా విద్యార్థినులు తమ ఆరోగ్యం గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ శిబిరంలో క్యాంపస్ లోని విద్యార్థిని విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది, సెక్యూరిటీ, హౌస్ కీపింగ్ సంబంధించి దాదాపుగా ఒక వెయ్యి మంది వరకు ఈ శిబిరం లో సేవలు ఉపయోగించుకున్నారు.

పాఠశాల స్థాయి నుండే ఉత్తమ విద్యా బోధన అవసరం : ఎమ్మెల్యే బడేటి

విశాలాంధ్ర -ఏలూరు : పాఠశాల స్థాయి నుండే ఉత్తమ విద్యా బోధన చేయడం ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించడం సాధ్య పడుతుందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధా కృష్ణయ్య హితవు పలికారు. శనివారం ఏలూరులోని విద్యానగర్ ప్రాంతంలో గల శ్రీ చైతన్య ఐపీఎల్ బ్రాంచిలో నిర్వహించిన ఐఎన్ టిఎస్ఓ లెవెల్ -2 ఫలితాల్లో చైతన్య విద్యార్థులు తమ ప్రతిభను

చాటుకున్నారు. ఇందులో భాగంగా తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి కంద్రేగుల జీవన్ సత్య సాయి కిషోర్ ల్యాప్టాప్ ను గెలుపొందగా, ఏడవ తరగతి చదువుతున్న ఐపీఎల్ విద్యార్థి కొమ్మన దివ్యరామ్ తేజ అశ్విన్ ట్యాబ్ గెలుపొందారు. నాలుగో తరగతి చదువుతున్న తిరుమల శెట్టి దర్శన్ సాయి గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ గెలుపొందగా విద్యార్థులకు ఎమ్మెల్యే బడేటి చంటి చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ వి.దుర్గారావు మాట్లాడుతూ ప్రణాళికా బద్ధంగా విద్యాబోధన చేయడం వల్లే చైతన్య విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా ఏజిఎం సుంకర పార్థసారథి, రీజినల్ ఇన్‌చార్జి సిహెచ్.ఉదయ భాస్కర్, జోనల్ అకడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్. వెంకటేశ్వరరావు, పాఠశాల డీన్ కెవి.లక్ష్మణ్ కుమార్, ఐపీఎల్ ఇన్‌చార్జి ఎన్. సత్యనారాయణ, ప్రైమరి ఇంచార్జ్ అరుణ, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి ఝాన్సీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ : ఎమ్మెల్యే చంటి

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు : ప్రజలకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొ న్నారు. ఏలూరు నగరంలో రోడ్ల నిర్మాణానికి, డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచడానికి అన్ని చర్యలు తీసుకుంటు న్నామన్నారు. ఏలూరులోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే బడేటి చంటి శనివారం ప్రజల నుండి వినతులు స్వీకరించారు. నియో జకవర్గం నలుమూలల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలకు సంబం దించిన వినతులను ఎమ్మెల్యే బడేటి చంటికి అందజేశారు. వాటన్నింటినీ స్వయంగా పరిశీలించి సమస్యల పరిష్కారానికి అప్పటికప్పుడే చర్యలు తీసుకున్నారు.

నగరంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పలువురు తమ వ్యక్తిగత సమస్యలు, అనారోగ్య సమస్యలపై ఎమ్మెల్యేను కలవగా అండగా ఉంటానని భరోసా కల్పించారు. పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయన్ను మర్యాద పూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, అన్ని వర్గాల వారికి అండగా నిలుస్తోందన్నారు. సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాల కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఉప్పాల జగదీష్ బాబు, నాయకులు బెల్లపుకొండ కిషోర్, చల్లా వెంకట సత్య వరప్రసాదరావు, వందనాల శ్రీను, ఆర్నేపల్లి తిరుపతి, త్రిపర్ణ రాజేష్, జుంజు మోజెస్, చిరంజీవి, చిన్ని అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

సత్తిబాబును మంత్రి కందుల దుర్గేష్ పరామర్శ

విశాలాంధ్ర - కడియం : కూటమి ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కడియం మండలం జేగురుపాడు గ్రామానికి చెందిన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుడు నాగిరెడ్డి సత్తిబాబును శనివారం ఆయన పరామర్శించారు. సత్తిబాబు కుటుంబ పరిస్థితిని చూసిన మంత్రి దుర్గేష్ మే నెలలో తప్పనిసరిగా పెన్షన్ వచ్చేలా ఏర్పాటు చేస్తానని హామీ యిచ్చారు. ఈ సందర్భంగా తన భర్త పరిస్థితిని అధికారులు నాయకుల దృష్టికి తీసుకుని వెళ్లేందుకు సోషల్ మీడియా వేదికగా సత్తిబాబు భార్య చక్రవేణి చేసిన ప్రయత్నాన్ని మంత్రి దుర్గేష్ అభినందించారు. శరీరంలో కదలికలు లేక మంచానికే పరిమితమై, ఇద్దరు చిన్నారులతో అవస్థలు పడుతున్న నాగిరెడ్డి సత్తిబాబు కుటుంబ పరిస్థితి చూసిన మంత్రి సత్వరమే స్పందించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డాక్టరేట్ రంగారావుకు సత్కారం

విశాలాంధ్ర - జగ్గంపేట : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న టివిఎస్ రంగారావుకు డాక్టరేట్ లభించింది. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని సౌత్ ఆఫ్రికాకు చెందిన ఎపికెజో ప్రొఫెటిక్ బైబిల్ యూనివర్సిటీ వారు శుక్రవారం విశాఖపట్నంలో డాక్టరేట్ ప్రధానం చేశారు. తన సొంత నిధులతో పాఠశాల అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నందున హెచ్ఎంకు డాక్టరేట్ ప్రధాన చేయడం జరిగిందని వందన యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు పులి ప్రసాద్ తెలిపారు. డాక్టరేట్ అందుకున్న రంగారావును తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు నామాల కృష్ణమోహన్, హుస్సేర్ బేగం, వివిఎస్ఎన్ మూర్తి, బి బాబురావు, బి శ్రీనివాస్, ఎస్ సూర్యప్రసాద్, ప్రతిభ, శ్రీరామ్ మూర్తి, డి పద్మావతి, సరోజినీ, నాగేంద్ర, కె తాతాజీ, బషీర బేగం షేక్, కనకదుర్గ, గంగా భావణి, బి వాణి, భాషీర్ షేక్, కెవివిఎస్ సుబ్రహ్మణ్యం, ప్రదీప్ కుమార్, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు సన్మానించారు.

సత్తా చాటిన గొల్లప్రోలు విద్యార్థిని

విశాలాంధ్ర - గొల్లప్రోలు : గొల్లప్రోలు పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న జ్యోతుల సాయి జ్యోతి 983 మార్కులు సాధించి ఔరా అనిపించింది. గొల్లప్రోలు పట్టణానికి చెందిన ఆమె ఎంపిసి విభాగంలో ఈ ఘనత సాధించింది. కాకినాడ జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లో ఎంపిసి విభాగంలో ఆమె ప్రథమ స్థానంలో నిలిచినట్లు శనివారం ఉపాధ్యాయులు తెలియజేశారు. ఆమెను అధ్యాపక సిబ్బంది, తల్లిదండ్రులు, పట్టణ ప్రజలు అభినందనలు తెలియజేశారు.

ఎమ్మార్వో కార్యాలయ స్థల పరిశీలన

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట పట్టణంలోని పాత పోలీస్ స్టేషన్ వద్ద గల పాత ఎమ్మార్వో కార్యాలయ స్థలాన్ని, భవనాన్ని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయ చినరాజప్ప శనివారం పరిశీలించారు. సామర్లకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సామర్లకోట-పెద్దాపురం ఏడీబీ రోడ్డులోని పట్టణానికి దూరంగా మాజేటి నగర్లో కొనసాగుతుండగా దానిని సామర్లకోట పట్టణ ప్రజలకు అందుబాటులోనికి తెచ్చేందుకు ప్రస్తుతం ఖాళీగా ఉన్న పాత ఎమ్మార్వో కార్యాలయాన్ని, ప్రక్కన గల కాలి స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్పు చేసేందుకుగాను ప్రతిపాదనలు తయారు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కార్యాలయ వివరాలను తహసీల్దార్ కే చంద్రశేఖర్ రెడ్డిని అడిగి ఎమ్మెల్యే తెలుసుకున్నారు.

ఘనంగా అచ్చిబాబు జన్మదిన వేడుక

విశాలాంధ్ర -కొవ్వూరు : కొవ్వూరు నియోజకవర్గం టీడీపీ నాయకులు ఆండ్రాషుగర్స్ జే ఎం డి పెండ్యాల అచ్చిబాబు జన్మదిన వేడుకలు కొవ్వూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కొవ్వూరు శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణ, జొన్నగడ్డ సుబ్బరాయ చౌదరి, కూటమి నాయకులతో కలసి బారి కేక్‌కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు అందిస్తూ అచ్చిబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని కార్యకర్తలు, నాయకులు, రక్తదానం చేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో పండ్లు, వృద్ధుల ఆశ్రమంలో చీరలు, పండ్లు భోజనాలు వితరణ చేశారు. జనసేన పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇంచార్జ్ టివి రామారావు కొవ్వూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు ఆంధ్రాషుగర్స్ JMD పెండ్యాల అచ్చిబాబు జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా కార్యక్రమం చేపట్టారు. తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకుల చేతుల మీదుగా ఒక్కొక్కరికీ రూ.500 పంపిణీ చేసారు. రిక్షా కార్మికులు నేటికీ నిరుపేదలుగా మిగిలిపోయారని, వారికి తమ వంతుగా సహాయమందించామని టివి రామారావు తెలిపారు. కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఒక్క తాటిపై తీసుకొని వస్తూ పాటి పటిష్టతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి అచ్చిబాబు కృషి ఎనలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఎడ్లబండి పోటీలు జయప్రదం చేయండి

- నేడు వెలుగుబంధలో జిల్లా స్థాయి ఎడ్ల బండి పోటీలు
- పోటీ నిర్వాహకులు కూటి కోటేశ్వరరావు

విశాలాంధ్ర - రాజానగరం : నేడు తమ గ్రామంలో జరగనున్న రాష్ట్ర స్థాయి ఎడ్లబండి రౌండ్ పోటీలను ప్రతిఒక్కరు జయప్రదం చెయ్యాలని పోటీ నిర్వాహకులు కూటి కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని వెలుగుబంధ గ్రామంలోని శ్రీ సత్తెమ్మతల్లి అమ్మవారి 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని చాగల్నాడు టైగర్ బిరుదాంకిత గ్రహీత కీర్తిశేషులు కూటి జగపతిరావు మెమోరియల్ నేతృత్వంలో నిర్వాహకులు కూటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ నెల13వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుండి రాజానగరం మండలంలోని వెలుగుబంధ గ్రామంలో రాష్ట్రస్థాయి ఎడ్లబండ్ల రౌండ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో తొలిసారిగా జరగనున్న ఎడ్లబండ్ల రౌండ్ పోటీలకు సర్వం సిద్ధం చేశామన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతగా విశాఖపట్నం నికి చెందిన మజ్జి దేవానంద్ వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా మొత్తం ఎనిమిది మంది విజేతలుగా నిర్ణయిస్తారని చెప్పారు. మొదటి బహుమతి 20 వేలు, ద్వితీయ బహుమతి 16 వేలు,తృతీయ బహుమతి 14 వేలు,నాల్గవ బహుమతి 12 వేలు, ఐదవ బహుమతి 10 వేలు, ఆరవ బహుమతి 9 వేలు,7 వ బహుమతి 8 వేలు,8 వ బహుమతి 6వేలు నగదు బహుమతులతో పాటుగా ట్రోఫీలు అందిస్తామని చెప్పారు. పోటీలకు ముఖ్యఅతిథిగా జీఎస్ఎల్ విద్య సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సందీప్, ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, తదితరులు హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ పోటీలను ప్రతిఒక్కరు ఆసక్తిగా తిలకించాలని, కమిటీ నిర్వాహకులు సహకరించాలని తెలిపారు.

ఇంటర్ ఫలితాలలో ప్రతిభ

సత్య ప్రభ ప్రైవేటు కళాశాలకే మండల మొదటి స్థానం

విశాలాంధ్ర - సీతానగరం: ఇంటర్మీడియట్ ఫలితాలలో మెరుగైన ప్రదర్శన కనబరిచిన సీతానగరం ప్రభుత్వ ఇంటర్ కళాశాల, సత్య ప్రభ ప్రైవేటు కళాశాల విద్యార్థులు. శనివారం ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడటంతో మండలంలో రఘుదేవపురం గ్రామంలో గల సత్య ప్రభ ప్రైవేటు కళాశాలకు చెందిన రెండవ సంవత్సరం ఎమ్ పి సి ఎస్ సంజన 965, బై పి సి జి నాగ దేవి 967 మార్కులతో మండల మొదటి స్థానంలో నిలిచారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి మొదటి సంవత్సరం 163 కి 68, రెండవ సంవత్సరం 93 కి 65 కాగా 42, 70 శాతంగా ఉత్తీర్ణత నమోదు అయ్యింది. ఇక ఫై ప్రసన్న తేజస్విని, గ్రూప్ ఎమ్ పి సి 887, ఆళ్ళ క్రాంతి గ్రూప్ సి ఈ సి 881,బి. లలితా దేవి బై పి సి 869 మార్కులు సాధించి ప్రతిభ చూపారు అని కళాశాల ప్రిన్సిపల్ చిక్కాల దొరబాబు అన్నారు. అలాగే సత్య ప్రభ నుండి మొదటి సంవత్సరం%శీ 95 ఎ% 60, రెండవ సంవత్సరం 50 కి 46 మంది ఉత్తీర్ణత సాధించారు అని కళాశాల యాజమాన్యం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. మా అధ్యాపక బృందం కృషితో మరియు విద్యార్థుల పట్టుదలతో ఈ ఫలితాలు సాధ్యం అయ్యాయి అని అన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా శాంతియుత ర్యాలీ

విశాలాంధ్ర - కడియం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వక్ఫ్ సవరణ చట్టం 2024 రాజ్యాంగ విరుద్ధంగా ఉందని, ఈ చట్టం ముస్లిముల మనోభావాలను దెబ్బ తీసే విధంగా ఉందని కడియం మస్జిద్ ఏ కౌసర్ కమిటీ ప్రెసిడెంట్ షేక్ సలీం పేర్కొన్నారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు కడియం మండలంలోని ముస్లిం ఐక్యవేదిక సభ్యులు వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ శనివారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. కడియం మస్జిద్ ఏ కౌసర్ నుండి ఎమ్మార్వో ఆఫీస్ వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వక్ఫ్ సవరణ బిల్లును తిరస్కరిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని సీఎం చంద్రబాబు నాయుడుని కడియం మండల ముస్లిం ఐక్యవేదిక తరఫున కోరుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మస్జిద్ ఏ కౌసర్ కమిటీ సెక్రటరీ సర్కార్ భాషా కడియం మండలం ముస్లిం ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

వరి , మొక్కజొన్న దిగుబడులు

విశాలాంధ్ర- తాళ్లపూడి : తాళ్లపూడి మండలంలో బల్లిపాడు గ్రామంలోని రైతులు వల్లభని చిన్న బసవన్న, వల్లభని లోహ ఉదయభాస్కర్ అనే రైతులు చేపట్టిన లిపి ఆర్ 126లి అనే రకం వరి పంట కోత ప్రయోగాలు జరిగాయి. దిగుబడి 50 బస్తాలు వస్తుందని అంచనాగా గుర్తించామని కొవ్వూరు ఆర్.డి. వో కార్యాలయపు ఉప గణాంక అధికారి సోమరాజు అన్నారు. ఏఎస్ఓ జోడాల వెంకట్ మాట్లాడుతూ ఈ రబీ సీజన్ లో తాళ్లపూడి మండలంలో సాధారణ దిగుబడి 50 బస్తాలు గా నమోదు అయిందని, మొక్కజొన్న 40 క్వింటాళ్లు గా దిగుబడి నమోదు అయ్యిందని, రైతులు కొన్ని చోట్ల 60 బస్తాల ధాన్యపు దిగుబడి సాధిస్తున్నారు అని ఇది సంతోష దాయకం అన్నారు. రైతులు నష్ట పోకుండా వ్యవసాయం చేయాలి అని దిగుబడులను తెలుసుకొని వ్యవసాయ శాఖ అందించే సూచనలు, సలహాలు పొందాలి అని కోరారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ సహాయకులు షేక్ ఆసిఫా, ఇన్సూరెన్స్ ఏజెంట్ గంజి శ్రీనుబాబు, టెక్నికల్ సహాయకులు రమణ, సురేంద్ర రైతులు పాల్గొన్నారు.

సత్తా చాటిన గురుకులం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఏలేశ్వరంలో గల బాలయోగి గురుకుల కళాశాల విద్యార్థినిలు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శారద దేవి తెలిపారు. పరీక్షలకు 56 మంది విద్యార్థులు హాజరు కాగా 56 మంది ఉత్తీర్ణత సాధించారని ఆమె తెలిపారు. వీరిలో 48 మంది విద్యార్థినిలు 'ఏ' గ్రేడ్ తోను, ఎనిమిది మంది విద్యార్థినిలు 'బి' గ్రేడ్‌తోను ఉత్తీర్ణత సాధించారని ఆమె తెలిపారు. వీరిలో జేఈఈ, నీట్ ప్రవేశ పరీక్షల్లో ఎంపిక కావడం అభినందనీయమన్నారు. విజేతలను అభినందించారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర - కాజులూరు : ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు ఆన్‌లైన్ చేసుకోవాలని, కాజులూరు మండలం ఎంపీడీవో జె రాంబాబు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ రుణాల ద్వారా నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించేందుకు సబ్సిడీ రుణాలు ప్రభుత్వం అందజేసేందుకు ఆన్‌లైన్ పోర్టల్ ఓపెన్ అయిందని అభ్యర్థులు మే 10 వరకు OBMMS పోర్టల్ నందు దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఎంపీడీవో జె రాంబాబు కోరారు.

టీడీపీ సభ్యత్వ కార్డులు ఎమ్మెల్యే పంపిణీ

విశాలాంధ్ర - రావులపాలెం : తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కార్డులను రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో సభ్యత్వం పొందిన వారికి బూత్‌ల వారీగా కార్డులను అందజేస్తామని తెలిపారు. క్లస్టర్, బూత్ ఇంచార్జ్‌లు సభ్యత్వ కార్డులను పంపిణీ చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ మరియు మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జ్‌లు పాల్గొన్నారు.

కాజులూరు విద్యార్థులకు జిల్లాలో ద్వితీయ స్థానం

విశాలాంధ్ర - కాజులూరు : కాకినాడ జిల్లా కాజులూరు మండలం ఇంటర్మీడియట్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీ కాదా దేవి హాసిని, ద్వితీయ స్థానం సాధించిందని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండల కేంద్రమైన కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం 93 మంది విద్యార్థులు హాజరుకాగా, 66 మంది విద్యార్థులు పాసై, 71 శాతం ఉత్తీర్ణత పొందారన్నారు. మొదటి సంవత్సరం 84 మంది విద్యార్థులు హాజరుకాగా, 42 మంది విద్యార్థులు హాజరై 50 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. తమ కళాశాలకు చెందిన కాదా దేవి హాసిని ఎంపీసీ గ్రూపులో 1000 మార్కులకుగాను 976 మార్కులు సాధించినందుకు, తండ్రి కాదా కోటేశ్వరరావును, అధ్యాపకులను, ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్, ఎంపీడీవో రాంబాబు, తహసీల్దార్ రాఘూర్, జనసేన మండల ఇన్చార్జ్ అన్నం శ్రీరామచంద్రమూర్తి, అధ్యాపకులు, గ్రామస్తులు అభినందించారు.

వనజీవి రామయ్య మృతితో వృక్ష విలాపం

విశాలాంధ్ర - గండేపల్లి : పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య మరణం యావత్ వృక్ష జాతికి విలాపం అని జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్ అన్నారు. మొక్కలు ప్రేమికులు రామయ్య దంపతులతో తనకు పరిచయం ఉందని జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు అందుకున్న సమయం 2019లో వారిని కలుసుకోవడం జరిగిందని రామయ్య మరణం ప్రకృతికి తీరని లోటని ఆయన నాటిన లక్షలాది మొక్కలు విలపిస్తూ ఉంటాయని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని పెద్దబ్రహ్మదేవం శ్రీ శారదా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత టి గంగాధర్ సంతాపం తెలిపారు.

అంతిమ సంస్కారం గౌరవ ప్రదంగా ఉండాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కొత్తపేట : జీవిత మజిలీలో అంతిమ సంస్కారం కూడా గౌరవప్రదంగా ఉండాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కొత్తపేట బోడిపాలెం వంతెన దిగువన సూర్య గుండాల పాయ వద్ద ఏర్పాటు చేసిన కైలాస భూమిని ఎంపీ హరీష్ మాధూర్, జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్, ఆకుల రామకృష్ణ, బండారు సంజీవ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ మనిషి జీవితంలో చివరి ఘట్టం పూర్తి సౌకర్యాలతో సాగనంపాలనే ఆలోచన నేడు ఈ కైలాస భూమిని అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యులు, చివరిసారిగా వీడ్కోలు పలకడానికి వచ్చిన వారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా కైలాస భూమిని అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. గతంలో ఈ ప్రదేశంలో అంత్య క్రియలు చేయడానికి వీలుగా ఉండేది కాదని, అంత్యక్రియల అనంతరం స్నానం చేయడానికి అవకాశం లేదని చెప్పారు. అటువంటి పరిస్థితి లేకుండా అన్ని సౌకర్యాలతో ఈ కైలాస భూమిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. అంత్య క్రియలకు నూతన భవనంతో పాటు నాలుగు చట్రాలను ఏర్పాటు చేశామని, స్నానాలకు పూర్తి ఏర్పాట్లు చేసినట్లు, అస్థికలను భద్రపరిచేందుకు లాకర్లనుసిద్ధం చేసినట్లు సత్యానందరావు వివరించారు. ఈ కైలాస భూమి అభివృద్ధి చేయడానికి సహకరించిన లైయిన్స్‌క్లబ్ సభ్యులు నంబూరి రెడ్డయ్య, బాదం ఐ బ్యాంక్ నిర్వాహకులు బాదం బాలకృష్ణ, దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఎంపీ నిధులు ఇచ్చిన హరీష్ మధూర్‌కు, నిధులు కేటాయించిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే సత్యానందరావు ధన్యవాదాలు తెలియజేశారు. ఎంపీ హరీష్ చేతుల మీదుగా కైలాస రథాన్ని ప్రారంభించారు. కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మి భాస్కరరావు, ముత్యాల బాబ్జీ, ధర్నాల రామకృష్ణ, బీర ఇస్సాక్, అద్దంకి చంటిబాబు, శ్రీఘాకోళ్ళపు బంగారం తమ్మన సాయిప్రసాద్, శ్రీఘాకోళ్ళపు రాధాకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర దేవరపల్లి: దేవరపల్లి మండలం ఎర్రగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చత్రపతి శివాజీ తెలిపారు సెకండ్ ఇయర్‌లో 21 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 16 మంది ఉత్తీర్ణత సాధించి 76.4% సాధించారు. ఇదే విధంగా మొదటి సంవత్సరం 19 మంది విద్యార్థులు హాజరుకాగా 13 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. 68.4% అదేవిధంగా ఐదుగురు విద్యార్థులు 900 మార్కులు పైబడి సాధించినట్లు తెలిపారు. సీఈసీ నందు 1000కి 971 మార్కులు ఎంపీసీలో 959 బైపీసీలో 944 సాధించినట్లు తెలిపారు. సీఈసీలో అమీ కారణ్య 971 ఎంపీసీలో పూర్ణ లక్ష్మీ దుర్గ 9 59 మార్కులు బైపీసీలో పుట్ట యాజ్ఞ కావ్య 944 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ ముగ్గురు విద్యార్థులు ఎర్రగూడెం గ్రామానికి చెందిన వారిగా తెలిపారు. ఇదేవిధంగా ఫస్ట్ ఇయర్‌లో ఎంపీసీలో కే కే మోహన్ లక్ష్మి 438 బైపీసీలో బిహారిక 375 సీఈసీ లో జి గోపిక 414 మార్కులు వచ్చినట్లు తెలిపారు ఈ విద్యార్థులను గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గద్దె శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ బొంత భరత్ బాబు, తెలుగుదేశం నాయకులు పెన్మత్స సుబ్బరాజు, బుల్లిన విజయభాస్కర్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

ఆనంద్ ఎడ్యుకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం

విశాలాంధ్ర- దేవరపల్లి: ఇంటర్మీడియట్ పరీక్షల్లో దేవ రపల్లి ఆనంద్ ఎడ్యుకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించినట్లు కళాశాల ఏవో డి ఆనంద ప్రసాద్ ప్రిన్సిపాల్ ఎం విక్రం తెలిపారు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం లో 451 మంది విద్యార్థులకు గాను 325 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ఎంపీసీ విభాగంలో మంచిలి గౌతమి470కి 462, జి నాని 418 జి దుర్గాప్రసాద్ , బి వందన 440కి 408 టి మధుశాలిని, 402 సీఈసీ విభాగంలో ఎస్ సమీరా 500కి 426, ఏ మానస 410, ఎం పి హెచ్ డబ్ల్యు విభాగంలో పి భాగ్యశ్రీ 500కి 478, జి హర్ష శ్రీ 467, జీ రోజా 449, ఎంఎల్టి విభాగంలో డి కాంచన గంగ 500 కి 455, ఈ హిందూ 448 సిఏస్సి విభాగంల పి మాధవి 500కి 445, డి కార్తీక్ 443, డి కార్తీక్ రెండవ సంవత్సరంలో 245 మంది విద్యార్థులు హాజరు కాగా 183 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ఎంపీసీ విభాగంలో కే అంజనీ దేవికి 1000కి 893, ఎన్ యామిని 887 , బైపీసీలో ఎం సౌమ్య 913, టి నాగేశ్వరి 849, సీఈసీలో ఎం సాయి నందిని 821, ఎంపిహెచ్‌డబ్ల్యులో ఎం నవ్యకుమారి 956. ఏ రమ్య 937, ఎం ఎల్ టి విభాగంలో ఎం శ్రావ్య 888, ఎం కళ్యాణి 856, సిఏస్సి విభాగంలో కె శాంతి ప్రియ 919, జే కృష్ణవేణి 902 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ విద్యార్థులను కళాశాల చైర్పర్సన్ డి మేరీ కమల కరస్పాండెంట్ డి సువర్ణ రాజు అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండల కేంద్రమైన ప్రత్తిపాడు బజారు వీధి రామాలయం ఆవరణలో శనివారం సదా మీ సేవలో (ఎస్ఎంఎస్) స్వచ్ఛంద సంస్థ నిరుపేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు, ఆహార పొట్లాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండలంలోని ధర్మవరం గ్రామపంచాయతీ కార్యదర్శి బి కామరాజు చేతుల మీదుగా పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శి కామరాజు మాట్లాడుతూ దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకుని, వారు ఆశించిన రీతిలో విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. దాతల సహాయంతో విద్యార్థులు ఉన్నత ప్రమాణాలు సాధించాలని ఆయన సూచించారు. శ్రీషిర్డిసాయి జ్యూయలరీస్ అధినేత పడాల శ్రీనివాసరెడ్డి, మండల ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు సలాది కృష్ణ, జి సత్యానందం, భేరి రాంబాబు, ఎస్వీ సోమేశ్వరరావు, ఎస్ లోవకుమారి, లక్ష్ములు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - సామర్లకోట : మహిళలు తమ స్వసక్తితో అభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసిందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట సంగీతరావు పేటలో శనివారం బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్నీ ఎమ్మెల్యే చిన రాజప్ప ప్రారంభించారు. నియోజకవర్గంలో 7 కుట్టు శిక్షణ కేంద్రాలను ప్రారంభించారు. సామర్లకోటలో కుట్టు శిక్షణకు 500 మంది దరఖాస్తు చేసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య తెలిపారు. ఈ కార్య క్రమం కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సాయిరూప స్టార్ రెసిడెన్సీ ప్రారంభం

విశాలాంధ్ర - సామర్లకోట : ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లో నూతనంగా నిర్మించిన సాయి రూప స్టార్ రెసిడెన్సీని పెద్దాపురం నియోజకవర్గం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శనివారం ఉదయం ప్రారంభించారు. కౌన్సిలర్ సేపేని సురేష్, రూప దంపతులు బస్టాండ్‌లో నిర్మించారు. వైసీపీ నాయకులు దవులూరి సుబ్బారావు, సామర్లకోట మున్సిపల్ చైర్మన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, టీడీపీ పట్టణ కార్యదర్శి, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బదుగు శ్రీకాంత్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్ చిన్ని, కౌన్సిలర్ బలుసు వాసు, ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో యువతులదే పైచేయి

విశాలాంధ్ర -తాళ్లపూడి : తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరాల్లో మొదటి మూడు స్థానాల్లో యువతులే ముందున్నారు. ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షల్లో ముగ్గురు బాలికలు కళాశాలలో టాపర్‌లుగా నిలిచారు. శనివారం వెలువడ్డ ఫలితాల్లో కొడమంచిలి ప్రియాంక 952 ప్రథమ స్థానం, కాస్సే హారిక లక్ష్మీ 941 ద్వితీయ స్థానం, చుక్కా త్రిపూర్ణ 909 తృతీయ స్థానం సాధించారు. ముగ్గురు బైపీసీ గ్రూప్ చదివినట్లు ప్రిన్సిపాల్ గరగ శ్రీనివాస్ తెలిపారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ఎంపీసీ విద్యార్థినీలు యు. గీతికా శృతి 425 తో ప్రథమ స్థానంలో, లంక తనూజ 416 ద్వితీయ స్థానంలో, కె.వి.ఎల్ లక్ష్మీ 409 మార్కులు తో తృతీయ స్థానం లో నిలిచారు. 2024..25 విద్యా సంవత్సరం లో ఇంటర్ సెకండ్ ఇయర్ 45 శాతం, ఫస్ట్ ఇయర్ 55 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి అభినందనలు తెలిపారు.

ప్రజా భాగస్వామ్యంతో ప్లాస్టిక్ నివారణ



విశాలాంధ్ర - కరప : ప్లాస్టిక్ వ్యర్థాలను అరికట్టేందుకు ప్రజాభాగస్వామ్యం తోనే సాధ్యమవుతుందని మండల పంచాయతీ విస్తరణ అధికారి ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం నడకుదురు, పెద్దాపురపాడు, కొరుపల్లి గ్రామాలలో చెత్త సేకరణ పై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. తడి పొడి చెత్తలను వేరు చేసి పంచాయతీ పారిశుద్ధ కార్మికులకు విడివిడిగా ఇవ్వాలని ఆయన తెలిపారు.పంచాయతీ కార్యదర్శులు వరిజ, వీరభద్రరావు, సుబ్బలక్ష్మి పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంఎన్ఆర్ విద్యార్థుల విజయభేరి

విశాలాంధ్ర – అనపర్తి : ఇంటర్మీడియట్ ఫలితాల్లో స్థానిక ఎం.ఎన్.ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ తాడి సతీష్ రెడ్డి మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 470 మార్కులకు గాను ఎం.దివ్య 464 మార్కులతో టౌన్ ఫస్ట్ సాధించగా, కె.మానస 463, కే.సంధ్య 463, టి.అవినాష్ రెడ్డి 463, వి.హితేంద్ర సాయి ధర్మా రెడ్డి 463 మార్కులతో నలుగురు విద్యార్థులు టౌన్ సెకండ్ ర్యాంక్ సాధించారు. అదేవిధంగా బైపిసి గ్రూపులో 440 మార్కులకు గాను ఓ.జనని శ్రీ 432 మార్కులతో టౌన్ ఫస్ట్ సాధించగా ఎస్.కరుణ 426 మార్కులతో టౌన్ సెకండ్ సాధించామన్నారు. అతి తక్కువ ఫీజులతో, అత్యుత్తమ క్రమశిక్షణతో గ్రామీణ విద్యార్థులతో కూడా కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థు లను, అధ్యాపక బృందాన్ని ఎం.ఎన్.ఆర్ విద్యా సంస్థల చైర్మన్ మల్లిడి అనంత సత్యనారాయణ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్.ఎన్.ఆర్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు మల్లిడి నారాయణరెడ్డి, సత్యభామ ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ మల్లిడి మాధవి లత, శ్రీ సాయి మాధవి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్స్ తేతలి రామభద్రారెడ్డి, ఎన్.నవీన్, ఐఐటి అండ్ మెడికల్ అకాడమీ ఇంచార్జ్ పి.శివయ్య, సత్యభామ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ షేక్ అమన్ రషీద్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ కాకినాడ 4వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

E.A. 50/2025, EP 12/2024
O.S. 120/2012

Between :

బుద్ధారెడ్డి గారి హరికృష్ణారెడ్డి .... DHR
మరియు
బీదం రెడ్డప్పరెడ్డి .... JDR

JDR బీదం రెడ్డప్పరెడ్డి, తండ్రి పెదరెడ్డప్పరెడ్డి, బిజినెస్, వయస్సు 56 సం॥లు, డోర్.నెం. 18-5-114/6/1, అద్దేపల్లి కాలనీ, రాజమండ్రి.

పై నెంబర్ E.A. 50/2025లో మీకు ఎన్ని పర్యాయములు నోటీసు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం వాయిదా తేది : 22-04-2025 అయిఉన్నది. ఆ రోజున ఉదయం గం॥ 10.30 ని॥లకు మీరు ప్రత్యేకంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమునందు తీర్మానింపబడును.

డి.ఎల్.నరసింహారావు, ఎస్ (డి) ఉమాదేవి
అడ్వకేట్స్, కాకినాడ
సెల్ : 9848403332

మత్స్యకారులకు నష్టపరిహారం చెల్లించాలి

విశాలాంధ్ర – యానాం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ని కలిసి రాబోయే రోజుల్లో నరసాపురం నుంచి తుని వరకు ఉన్న మత్స్యకారులు గోదావరిలో వేట చేసిన సముద్రంలో వేట చేసిన ఎటువంటి వ్యత్యాసం లేకుండా ప్రతి ఒక్కరికి నష్టపరిహారం వచ్చేలా చూడాలని తుని దగ్గర నుంచి నర్సాపురం వరకు మధ్యలో ఉండే ఎమ్మెల్యేలందరూ సంతకాలు చేసి మల్లాడి కృష్ణారావు ఆధ్వర్యంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు(బుచ్చిబాబు), పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణలు అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ని కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అందులో సిఎస్ఆర్ నిధులను కూడా ఒక శాతం నుంచి రెండు శాతంకు పెంచాలనే డిమాండు ఒకటి. అలాగే ఈ రెండు డిమాండ్ల మీద కాకినాడ కలెక్టర్కి, ముఖ్యమంత్రికి డిప్యూటీ ముఖ్యమంత్రికి కూడా ఇవ్వడం జరిగింది. అలాగే మీరు కూడా త్వరలోనే కంపెనీవారిని పిలిపించి ఈ నెలాఖరులోపు మీటింగు ఏర్పాటు చేసి మాట్లాడాలని ముందు కాకినాడ కలెక్టర్ని కోరిన విధంగానే కోనసీమ కలెక్టర్ని కూడా కోరడమైనది. దీనికి వారు కూడా సానుకూలంగానే స్పందించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర – ఆలమూరు : ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో చింతలూరుకు చెందిన బైపీసీ విద్యార్థిని వాకా అమృత 914 మార్కులతో సత్తా చాటింది. మొదటి సంవత్సరం ఫలితాల్లో జొన్నాడకు చెందిన ఎంపీసీ విద్యార్థి గుత్తికొండ సూర్యనారాయణమూర్తి 423 మార్కులతో సత్తా చాటాడు. ఎంపీసీ విద్యార్థిని బి శ్రీవల్లి 422 మార్కులు సాధించి ప్రతిభ చూపించింది. మొదటి, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో గతం కన్నా మెరుగైన ఫలితాలు తమ కళాశాల విద్యార్థులు సాధించారని ప్రిన్సిపాల్ సురేష్ రెడ్డి తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థిని, విద్యార్థులను పలువురు అభినందించారు.

పెదపళ్ల విద్యార్థిని ప్రతిభ

శనివారం వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో పెదపళ్ళకు చెందిన చిరుకూరి సాత్విక అత్యుత్తమ ప్రతిభ చూపి 987 మార్కులతో సత్తా చాటింది. సాత్విక గతంలో 10వ తరగతి ఫలితాల్లో మండలంలో ద్వితీయ స్థానాన్ని ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో నాలుగవ ర్యాంకుని సాధించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అదే వరవడి కొనసాగిస్తూ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ప్రతిభ చూపింది. సాత్వికను పెదపళ్లకు చెందిన పలువురు అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - ఏలేశ్వరం : రాష్ట్ర ప్రభు త్వం శనివారం ప్రక టించిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో ఏలేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ రాజ్ కుమార్ తెలిపారు. రెండవ సంవత్సరం ఫలితాల్లో 85% మొదటి సంవత్సరం ఫలితాల్లో 60 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. బైపీసీలో రెండవ సంవత్సరం 1000/972 మార్కులు సాధించి పెండ్యాల రాజ్ కుమార్ మొదటి స్థానంలో నిలిచారన్నారు. రెండవ స్థానంలో యు సుసానే రాణి 1000/928, మూడోవ స్థానంలో పెండ్యాల మేరీ సునంద 1000/920 మార్కులు సాధిం చారన్నారు. రెండవ సంవత్సరం ఎంపీసీ లోను, మొదటి సంవత్సరం ఎంపీసీ బైపీసీ లోను కూడా విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణుల య్యారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను ఆయన అభినందించారు.

పారామెడికల్ కోర్సులతో ఉపాధి

విశాలాంధ్ర – రాజానగరం : వైద్య రంగంలో విస్తరిస్తున్నమార్పులతో పారామెడికల్ కోర్సులతో ఉపాధికి కొదవ లేదని జిఎస్ఎల్ విద్య సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సందీప్ అన్నారు. మండలంలోని జిఎస్ఎల్ వైద్య కళాశాల ప్రాంగణంలో ఈ నెల 11న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ ప్రగతి అధ్యక్షతన జరిగిన పారామెడికల్ కోర్సులు స్నాతకోత్సవ వేడుకలుకి ముఖ్య అతిథిగా హాజరైన జిఎస్ఎల్ విద్య సంస్థల ఎండి డాక్టర్ గన్ని సందీప్ మాట్లాడుతూ వైద్య చికిత్సల్లో వేర్వేరు విభాగాల నందు పారామెడికల్ వృత్తి నిపుణుల ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. రోగి త్వరితగతిన కోల్కొనేందుకు వైద్యుల సలహాలు సూచనలను అమలు చేయడంలో పారామెడికల్ టెక్నిషన్ సర్వీసులు కీలకంగా మారాయన్నారు. ప్రస్తుతం వైద్య రంగంలో మెడికల్ స్పెషాలిటీలు, సూపర్ స్పెషాలిటీలు, సబ్ స్పెషాలిటీలు విస్తరిస్తున్న విధంగానే పారామెడికల్ కోర్సుల్లో కొత్తవిభాగాలు విస్తరిస్తున్నాయన్నారు.ఈ నేపథ్యంలో జిఎస్ఎల్ పారామెడికల్ కళాశాలలో మరికొన్ని పారామెడికల్ కోర్సులు రావాల్సిన అవశ్యకత ఉందని, త్వరలో ఆ దిశగా నూతన కోర్సులు వస్తాయని డాక్టర్ సందీప్ వివరించారు. సభ అధ్యక్షులు ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ ప్రగతి మాట్లాడుతూ జిఎస్ఎల్ ప్రాంగణంలో 2003లో ప్రారంభమైన పారా మెడికల్ కోర్సు నుంచి 21 బ్యాచ్ల విద్యార్థులు ఆయా విభాగాల్లో నిపుణులుగా బయటకు వెళ్ళారన్నారు. ప్రస్తుతం కాలేజీలో 272 మంది విద్యార్థులు 12 రకాల పారామెడికల్ డిగ్రీ కోర్సుల్లో చదువుతున్నారని, 90 శాతం ఉత్తీర్ణత సాధించారనీ తెలిపారు.తొలుత ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు పారామెడికలిస్టులకు పట్టాలు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జిఎస్ఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాధిక, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.గురునాథ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మిత్రా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ టివిఎస్ పి.మూర్తి, పారా మెడికల్ కాలెజి పూర్వపు ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యప్రకాష్, ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి తదితరులు గ్రాడ్యుయేట్లకు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు ప్రధానం చేశారు.

వికాస్ విజయ దుందుభి

విశాలాంధ్ర – నిడదవోలు : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించి నిడదవోలు మండలం సమిశ్ర గూడెం వికాస్ కాలేజీ పట్టణంలో అగ్రస్థానంలో నిలిచిందని వికాస్ కాలేజీ డైరెక్టర్లు ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ ఇంటర్ ఫలితాల్లో 98 శాతం, జూనియర్ ఇంటర్ ఫలితాల 98.8 శాతం ఉత్తీర్ణతతో వికాస్ కాలేజీ ఉత్తమ ఫలితాలు సాధించిందన్నారు. సీనియర్ ఇంటర్ లో 1000 మార్కులకు గాను టీవీఎస్ఎస్ శ్రీరామ్ స్వరూప్ ఎంపీసీలో 992,ఎస్ కే అమర్ 988, ఎస్.కె ఖైమున్నిసా 988, పి సంతోష్ 987, ఎన్ ఎల్ ధనశ్రీ 987 సీనియర్ ఎం ఇ సి లో కె రాజేశ్వరి 973 సీఈసీ లో ఏ కిరణ్ చందు కుమార్ 952 మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఇంటర్లో ఎంపీసీ లో ఐదుగురు విద్యార్థులు 470 మార్కులకు గాను 465 మార్కులతో బి.సంధ్య, ఎం.జస్వంత్ శ్రీరామ్, పి సిద్ధార్థ, టీ జస్వంత్, టి కార్తీక్ అగ్రస్థానాన్ని సాధించారన్నారు. ఎం సంజన 464 ఎల్ నవదీప్ 464 మార్కులు. జూనియర్ సీఈసీ లో 500 కు గాను జి కీర్తి సాదీవ్య 487,జూనియర్ ఎంఇసిలో ఎస్ఎస్ దుర్గాభవాని 468 మార్కులు సాధించి పట్టణంలో అగ్రస్థానంగా నిలిచారన్నారు. సీనియర్ ఇంటర్లో ఉత్తీర్ణత శాతం 98 జూనియర్ ఇంటర్లో ఉత్తీర్ణశాతం 98.8 ఇంత ఘనం సాధించిన విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ అందుకు సహకరించిన అధ్యాపక బృందానికి విద్యార్థుల తల్లిదండ్రులకు డైరెక్టర్లు కృతజ్ఞతలు తెలిపారు.

అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినుల విజయకేతనం

విశాలాంధ్ర – గోపాలపురం : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో స్థానిక గోపాలపురం లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలకు చెందిన విద్యార్థినులు విజయ కేతనం ఎగరవేసినట్లు ఇన్చార్జి ప్రిన్సిపాల్ రాజేశ్వరి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం 2024 25 విద్యాసంవత్సరానికి సీనియర్ ఇంటర్మీడియట్ విభాగంలో 64 మంది పరీక్షలకు హాజరుకాగా 62 మంది ఉత్తీర్ణులై 96.85% ఉత్తీర్ణత సాధించగా, మాపాటి నిర్మల కుమారి అనే సీనియర్ ఇంటర్ విద్యార్థిని 1000/980 మార్కులు సాధించి తన సత్తా చాటిందీ. అదేవిధంగా జూనియర్ ఇంటర్ పరీక్షలలో 74 మంది హాజరుకాగా 73 మంది ఉత్తీర్ణులై 98.64% ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఇందులో మొదటి సంవత్సరం బైపిసి విద్యార్థిని పి నవ్య శ్రీ 440/430 మార్కులు సాధించి బైపిసి విభాగంలో కాలేజ్ టాపర్ గా నిలిచింది. ఎంపీసీ కి చెందిన వీ రోజీ 470కి గాను 446 మార్కులు సాధించి ఎంపీసీ గ్రూపులో అగ్రశ్రేణిలో నిలిచింది. తమ ఆశ్రమ పాఠశాలకు మంచి ఉత్తీర్ణతను సాధించిన విద్యార్థినిలను ప్రిన్సిపాల్ రాజేశ్వరి వైస్ ప్రిన్సిపాల్ కుమారి మరియు కాలేజీ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

మార్క్ శంకర్ కోలుకోవాలని ప్రత్యేక పూజలు పూజలు

విశాలాంధ్ర – కరప : ఆంధ్ర రాష్ట్ర డిప్యూటీ సీఎం కొనిదల పవన్ కళ్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ తొందరగా కోలుకోవాలని కరప మండల జనసేన పార్టీ అధ్యక్షులు బండారు మురళి, నీటి సంఘం అధ్యక్షులు తుమ్మలపల్లి గోవిందరాజులు, తుమ్మలపల్లి మాచిరావు, గంట నాని బాబు పెనుగుదురు వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించామని తెలిపారు. మార్క్ శంకర్ ప్రమాదం నుండి తొందరగా కోలుకొని ఆయురారోగ్యాలు అందించాలని దేవుడిని వేడుకున్నారు.

గోనె సంచుల నాణ్యతలో ఎటువంటి రాజీలేదు : జేసీ

విశాలాంధ్ర -ఏలూరు: ధాన్యం కొనుగోలులో భాగంగా, రైతులు ఉపయోగించే గోనె సంచులు నాణ్యతగా ఉండాలని, ఈ విషయంలో ఎటువంటి రాజీలేదని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి స్పష్టం చేశారు. శనివారం స్థానిక గౌతమి సమావేశ మందిరంలో రబీ ధాన్యం కొనుగోలుపై రైస్ మిల్లర్లు, వ్యవసాయ, సివిల్ సప్లైస్, రవాణా, సహకార, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 2024-25 రబీ పంట కాలంకు సంబంధించి ధాన్యం సేకరణ ఏప్రిల్ 2 నుంచి ప్రారంభమైందనీ, వ్యవసాయ శాఖ వారి అంచనాల ప్రకారం ధాన్యం 3.53 లక్షల మెట్రిక్ టన్నులు, లోగడ ప్రధాన కార్యాలయం ద్వారా ధాన్యం సేకరణ లక్ష్యం 1.50 లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్ణయించినట్లు తెలిపారు. తదుపరి రైతుల యొక్క శ్రేయస్సు కొరకు జిల్లా క్షేత్ర స్థాయి అధికారుల అభ్యర్థన మేర 2.00 లక్షల మెట్రిక్ టన్నులుగా పెంచడమైనదన్నారు. సదరు ధాన్యమును నాణ్యత నిబంధన మేరకు మేరకు ధాన్యం కొనుగోలు చేయుటకు ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందన్నారు. రబి ధాన్యం సేకరణకు సుమారు 55 లక్షల గోనె సంచులు అవసరత ఉంటుందన్నారు. గోనె సంచులు రైతులకు అందుజేయుటకు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో పెట్టుటకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. నిర్దేశించిన రైతు సేవ కేంద్రాల్లో అందు బాటులో ఉన్న గోనె సంచుల వివరాలు అందించా లన్నారు. అదేవిధంగా ఎక్కడైనా బాగాలేని గోనెసంచులు తిరస్కరించినప్పుడు సంబంధి వివరాలు తమకు సమర్పించాలన్నారు. ధాన్యం రవాణాలకు సంబంధించి వాహనాల రిజిస్ట్రేషన్ రెండింతల వేగవంతం చేయాలని రవాణా శాఖ అధికారులు ఆదేశించారు. 22 మండలాలలో సాగు చేసిన ధాన్యం సేకరణ కొరకు ఉన్న ఆర్.ఎస్.కెల 241 అయితే ఈ 241 ఆర్.ఎస్.కె కేంద్రములను ధాన్యం సేకరణ కోసం తటస్థీకరణ (క్లస్టరింగ్) చేసిన అనంతరం ఉన్న సంఖ్య రైతులు 118 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ 118 ఆర్.ఎస్.కెలకు అనుసంధానం చేసిన 62 ప్రొక్యూర్మెంట్ సపోర్టింగ్ ఏజెన్సీలు 2024-25 రబీ సీజన్ కు సంబంధించి ధాన్యం కనీస మద్దతు ధర 'గ్రేడ్-ఎ' రకము క్వింటాల్ కు రూ.2320 మరియు 'కామన్' రకము క్వింటాల్ కు రూ.2300 చొప్పున నిర్ణయించవైనదన్నారు. రైతులు పండించిన ధాన్యమును కనీస మద్దతు ధరకు ప్రభుత్వం వారు ప్రారంభించిన రైతు సేవా కేంద్రములలోని ధాన్యం కొనుగోలు ఏజన్సిల ద్వారా FAQ నిభంధనల ప్రకారం విక్రయించుకుని, ప్రభుత్వం వారు నిర్ణయించిన కనీస మద్దతు ధర పొందగలరన్నారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ (కంట్రోల్ రూమ్ నెంబర్లు 08812-230448, 7702003584, 7569562076 మరియు 7569597910)నకు కాల్ చేయవచ్చునని తెలియజేశారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరామమూర్తి, డీఎస్ఓ ప్రతాపరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ భాషా, డి శ్రీనివాస్,రైస్ మిల్లర్లు,వ్యవసాయ, సివిల్ సప్లైస్,రవాణా, సహకార, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాత్రికేయులపై కేసును ఎత్తివేయాలి

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం : సాక్షి సంపాదకునితో సహ మరో ఆరుగురు పాత్రికేయులపై పల్నాడులో నమోదు చేసిన కేసును బేషరతుగా ఎత్తివేయాలని కోరుతూ పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పాత్రికే యులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక డి.ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. తాడేపల్లి గూడెం జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్, ప్రెస్ క్లబ్, ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, ఏపీయు డబ్ల్యుజే జిల్లా కార్యదర్శి గజపతి వరప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యడ్లపల్లి మురళీకృష్ణ, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తమ్మిసెట్టి రంగ సురేష్ మాట్లాడుతూ ప్రచురించిన వార్తలలో పొరబాట్లు ఉంటే సంబంధిత వ్యక్తులను వివరణ ఇవ్వవచ్చునని, పల్నాడు నేరవార్త విషయంలో వివరణ ఇచ్చి, సవరణ వేయాల్సిందిగా కోరి ఉండాల్సిందని, అందుకు భిన్నంగా నేరుగా సంపాదకునితో సహ పాత్రికే యులపై కేసులు నమోదు చేయడం కక్ష సాధింపు చర్య అవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను గౌరవించి వెంటనే కేసులు ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు.

ఫీడ్ కంపెనీలు ధరలు తగ్గించకపోతే పోరాటం

భీమవరంలో జరిగే ఆక్వా సమావేశానికి తరలిరండి : గాంధీ రాజు

విశాలాంధ్ర - పాలకొల్లు: ఆక్వా రైతుల సంక్షేమమే జై భారత్ క్షీర రామ ఆక్వా రైతు సంఘం లక్ష్యం అని సంఘ చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు అన్నారు.శనివారం జై భారత్ క్షీరరామ ఆక్వా రైతు సంఘ భవనంలో గాంధీ రాజు అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘ చైర్మన్ గాంధీ భగవాన్ రాజు మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో క్రాఫ్ హాలిడే ప్రకటించిన అనంతరం, ఫీడ్ కంపెనీలు కొంతమేర స్పందించాయని, ఫీడ్ ఎం.ఆర్.పి ధరపై కేజీకి కేవలం నాలుగు రూపాయలు మాత్రమే రేటు తగ్గిస్తున్నట్లు మాకు సమాచారం ఇచ్చారని చెప్పారు. ఇన్వాయిస్ మీద కేజీ ఫీడ్ పై,రూ.3.12 తగ్గించినట్లు మాత్రమే అవుతుందన్నారు. అయితే ఈ ఫీడ్ పై ప్రస్తుతం తగ్గించిన ఈ ధర,ఆక్వా రైతుకు ఏమాత్రం మేలు చేకూర్చలేదని స్పష్టం చేశారు. ఫీడ్ కంపెనీలు ధరల తగ్గింపుపై చేసిన ప్రకటన ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. గత సంవత్సర కాలం నుండి పోరాటం చేసినా,ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై అధ్యయనం చేసి, రా మెటీరియల్ ధరలు తగ్గిస్తే బాగుండేదన్నారు. కేజీకి రూ.20నుండి 25లకు తగ్గించాలని ఆక్వా రైతు సంఘాల తరపున డిమాండ్ చేస్తే, ఫీడ్ కంపెనీలు రైతులకు మేలు చేకూర్చే విధంగా కనీసం కేజీకి రూ.20 తగ్గించడం మానేసి, సుమారుగా కేవలం రూ.4 మాత్రమే తగ్గించడంపై తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఆక్వా రైతు దీన్ని అంగీకరించే పరిస్థితి లేదన్నారు. రైతులు చూస్తూ ఎలా మోసపోవాలని గాంధీ రాజు సూటిగా ప్రశ్నించారు. ఫీడ్ పై, 1కేజీ కి, రూ.20 తగ్గించాలని గాంధీ రాజు డిమాండ్ చేశారు. లేదంటే తమ పోరాటం మరింత ఉధృతం చేస్తామని, రైతుల పక్షాన అండగా ఉండి వారికి న్యాయం జరిగే వరకూ ఫీడ్ ధరలు తగ్గి రొయ్య మద్దతు ధర పెరిగి రైతులకు మేలు జరిగే వరకు, తమ సంఘం తరపున పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కొద్ది రోజుల క్రితం అమెరికా సుంకం విధించిందనే పేరుతో 100 కౌంటు, 200 రూపాయలకు తగ్గించిందన్నారు. ప్రస్తుతం అమెరికా ప్రభుత్వం సుంకాలు 90 రోజులు వాయిదా వేసి నాలుగు రోజులు అయిందని, కానీ ఇప్పటికీ, రొయ్య కొనే విషయంలో, అమెరికా సుంకం సాకు చూపి, పాత రేట్లను అమలు చేయకుండా తగ్గిన రేట్ల తో కొంటూ ఆక్వా రైతులను దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆక్వా రైతుల సమస్యలను వివరిస్తూ కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ను సంఘం తరపున సభ్యులందరూ కలిసి ఇప్పటికే మెమోరాండం ఇవ్వడం జరిగిందన్నారు. అదేవిధంగా ఆదివారం భీమవరం లో జరిగే జిల్లా ఆక్వా రైతు సదస్సుకు అక్కడి ముఖ్య ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలో ఉన్న ప్రతి ఆక్వా రైతు తప్పకుండా హాజరుకావాలని గాంధీ రాజు పిలుపునిచ్చారు. పాలకొల్లు, నరసాపురం, ఆచంట నియోజకవర్గాలకు సంబంధించిన రైతు నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెన్మత్స వెంకట సత్యనారాయణ రాజు, సజ్జ వీర వెంకట సత్యనారాయణ, సుధీర్ రెడ్డి, బోనం వెంకట నరసయ్య, గుంటూరు వెంకట సత్యనారాయణ రాజు, మేడిది జాన్ రాజు , మేక ఫణీంద్ర, అంగర వర ప్రసాద్, బోనం రంగయ్య నాయుడు, దాట్ల సోమేశ్వర రాజు, రుద్రరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

పార్కు నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : కాకినాడ రూరల్ మండలం రమణయ్య పేట ఎఫ్సీఐ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న పార్క్ కి రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ సుమారు రూ.45 లక్షల జెమిని ఆయిల్స్ వారి సీఎస్ఆర్ నిధులతో పార్క్ కి శంకుస్థాపన చేసి నిర్మాణం చేపడుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వంలో రోడ్ల నిర్మాణంతో పాటు పార్కులు అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. శివారు ప్రాంతాల్లో చెట్లు ఉండే చోట బహిరంగంగా మద్యం సేవిస్తూ, గంజాయి సేవిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగించే వారిపై పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెమిని కంపెనీ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర - తాళ్లరేవు : తాళ్ళరేవు మండలం పోలేకుర్రు గ్రామపంచాయతీ సంకటరేవు గ్రామంలో భీమ్ సేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం గౌతమ బుద్ధ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నూతన విగ్రహ ఆవిష్కరణ జరిగింది. ఈ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా అమలాపురం పార్లమెంటరీ సభ్యులు గంటి హరీష్ మాదర్, ముమ్మిడివరం నియోజకవర్గం శాసనసభ్యులు ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ విప్ దాట్ల సుబ్బరాజుల చేతులమీదుగా విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, మందాల గంగ సూర్యనారాయణ, ధూళిపూడి వెంకటరమణ, కట్టా త్రిమూర్తులు, ఉంగరాల వెంకటేశ్వరరావు, జక్కుల ప్రసాద్, అత్తిలి బాబురావు, సంకటరేవు బీమ్ సేన యూత్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దడాల సుధీర్ కుమార్ మరియు పలువురు గ్రామస్తులు పెద్దలు, తెలుగుదేశం, జనసేన మరియు బిజెపిల చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పలువురు తాళ్లరేవు మండల దళిత అసోసియేషన్ నాయకులు, సభ్యులు, అభిమానులు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే దేవ

విశాలాంధ్ర - రాజోలు : శనివారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలలో రాజోలు మండలం శివకోడు నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు జిల్లాస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించారు. ఈ నేపథ్యంలో విద్యార్థులను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ విశ్వేశ్వరాయపురంలోని తన క్యాంపు కార్యాలయం వద్ద శనివారం సాయంత్రం అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 470 మార్కులకు 465 మార్కులు ముగ్గురు విద్యార్థులకు, 464 మార్కులు నలుగురు విద్యార్థులు, 462 మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులు సాధించటం చాలా గొప్ప విషయమని అన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మరింతగా రాణించాలని తాను ఆకాంక్షిస్తున్నాను అన్నారు. 400 మార్కులు దాటి 72 మంది విద్యార్థులు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

విశాలాంధ్ర - పెద్దాపురం : నియోజకవర్గ పరిధిలో ప్రస్తుత వేసవి సీజన్లో ఎక్కడా మంచినీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల బాబు అన్నారు. మండలంలోని చదలాడ, తిరుపతి, మర్లావ గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా నిర్మించిన వాటర్ ట్యాంకులను శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా చదలాడ గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకులు ఒబిలిశెట్టి పెద్దకాపు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా ప్రతీ గ్రామానికి సురక్షిత నీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నారు. వేసవిలో ఎక్కడా నీటి కొరత ఉండకూడదనే ఉద్దేశ్యంతో జెజెఎం నిధులతో ప్రతీ గ్రామంలో మంచినీటి సరఫరా అయ్యే విధంగా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు మొయిళ్ల కృష్ణమూర్తి, తోట రామకృష్ణ, మాజీ సర్పంచ్ కొత్తం శ్రీనివాసరావు. గుడా మాజీ డైరెక్టర్ ఎలిశెట్టి నాని, కేదారి నల్లబాబు, కొప్పిరెడ్డి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర- తాళ్లపూడి : తాళ్లపూడి మండలంలో ఈ నెల 14న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఆహ్లాదకరంగా పండగ వాతావరణంలో చేసుకోవాలని తాళ్లపూడి పోలీస్‌లు కోరారు. ఈ కార్యక్రమానికి ఎటువంటి డి.జె అనుమతులు లేవని ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించకూడదని ఎస్సై అన్నారు. అంబేద్కర్ మహోన్నతమైన వ్యక్తిని ఆయన పుట్టినరోజు ప్రశాంత పండుగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. కుల మతాలకు అతీతంగా అందరూ కలిసి నిర్వహించుకోవాలని తాళ్ల పూడి ఎస్సై రామకృష్ణ కోరారు. తాళ్లపూడి మండలం లో రెండు సంవత్సరాలు క్రితం జరిగిన వివాదం నేపథ్యం లో ముందు జాగ్రత్తగా, ప్రత్యేక పోలీస్ బృందం తాళ్లపూడి మండలంలో పర్యటిస్తోంది ఎస్సై రామకృష్ణ అన్నారు.

అంగరంగ వైభవంగా శ్రీ చింతాలమ్మ సిరి మహోత్సవం

విశాలాంధ్ర - సీతానగరం : అంగరంగ వైభవంగా శ్రీ చింతాలమ్మ సిరి మహోత్సవం. మండలంలో రఘుదేవపురం గ్రామపంచాయతీ పరిధిలో గల గ్రామ దేవత శ్రీ చింతాలమ్మ అమ్మవారు సిరి మహోత్సవం శనివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు చుండ్రు సత్య ప్రసాద ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగం గా ఉదయం నుండి భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి దర్శనం చేసు కుని ముక్కులు చెల్లించుకున్నారు. అలాగే రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రతీ సంవత్సరం నిర్వహించే శ్రీ చింతాలమ్మ అమ్మవారి సిరి మహోత్సవంలో ఆలయం ప్రాంగణంలో సాయంత్రం ఉపవాసం ఉన్న వ్యక్తి, మచ్చలేని నల్ల మేక, గుమ్మడి పండును సిరిమానుకు కట్టి త్రిప్పు దంతో భక్తులు పుష్పాలు, పండ్లును వాటి పైకి విసిరి తమ భక్తిని చాటు కుని అనంతరం చింతాలమ్మ అమ్మవారికి తెల్లవార్లు జాతర కనుల పం డుగగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కోరిన కోరికలు నెరవేర్చే తల్లిగా శ్రీ చింతాలమ్మ అమ్మవారు ప్రసిద్ధి చెందిం దన్నారు. అలాగేఅమ్మవారి ఆశీస్సులు అందరి మీద ఉండి గ్రామం పాడి, పంటలతో సుభిక్షంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో గాయత్రి కళాశాల హవా

- నియోజకవర్గంలో ప్రథమ స్థానం

విశాలాంధ్ర - రాజానగరం : ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా శనివారం విడులైన ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్ష ఫలితాల్లో రాజానగరం మండలంలో బాలకలు తమ హవా కొనసాగించారు.ఏకంగా మొదటి నాలుగు స్థానాల్లో తమ ప్రతిభను కనబరిచి సత్తా చాటుకున్నారు. రాజానగరం నియోజకవర్గంలో తొమ్మిది ఇంటర్ కలశాలు, రంగంపేటలో ఒక ప్రభుత్వ కళాశాల కలిపి మొత్తం పది కళాశాలలు ఉండగా గాయత్రి ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలుస్తోంది.

గాయత్రి కళాశాల ప్రభంజనం

మండలంలోని కానవరం గ్రామంలోని గాయత్రి విద్యా సంస్థల విద్యార్థులు విశేష ప్రతిభను కనబరిచారు. ద్వితీయ సంవత్సరం పి.నర్మద బైపిసి విభాగంలో 989 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. పి.వేదహర్షి ఎంపీసీ విభాగంలో 985 మర్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. వీరితో పాటుగా 900 మార్కులు పైగా 20 మంది విద్యార్థులు సాధించారు. అలాగే ప్రథమ సంవత్సరం లో వి. ప్రియ అక్షయ ఎంపీసీ విభాగంలో 461 మార్కులతో ప్రథమస్థానంలో నిలవగా, వి. కోమలి లక్ష్మీ బైపిసి విభాగంలో 423 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది.400 మార్కులు పైగా 38 మంది విద్యార్థులు సాధించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ వివివిఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ ఘన విజయం ఇచ్చిన అధ్యాపకులకు, విద్యార్థులకు, తల్లి దండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

సత్తా చాటిన దివ్య విద్యార్థులు

మండల కేంద్రమైన రాజానగరంలోని దివ్య విద్యాసంస్థలు విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో సత్తా చాటారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల వైస్ చైర్మన్ బర్ల విజయ్ తెలిపిన వివరాలు ప్రకారం ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో టి. ప్రశాంతి 952 మార్కులు సాధించగా,ఎ.సతీష్ 949 మార్కులు, జె. అమరావతి 927 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో కైవసం చేసుకున్నారన్నారు. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఓ.శిరీష 455 మార్కులు, ఎస్. గీతా చరణ్య 445 మార్కులు, ఎన్.చక్రి 441 మార్కులు సాధించి ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు.మొత్తం ఇంటర్ ఫలితాలలో 96 శాతం ఉత్తీర్ణత సాధించారనీ చెప్పారు. ఇంతటి ఘనవిజయాన్ని అందించిన విద్యార్థులను దీనికి సహకరించిన తల్లిదండ్రులను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. దీనిలో భాగంగా గాయత్రి, దివ్య విద్యాసంస్థలో విజయ సంబరాలు జరుపుకున్నారు.

జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ టు విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - పాలకోడేరు : పాలకోడేరు మండలం పాలకోడేరు జిల్లా పరిషత్ హై స్కూల్ ప్లస్ టు కేటగిరిలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలలో 17 మంది విద్యార్థులకు గాను ఎనిమిది మంది 47% ఉత్తీర్ణత సాధించినట్లు, అదేవిధంగా ద్వితీయ సంవత్సరం 15 మంది విద్యార్థులకు 15 మంది నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన సాధించినట్లు హెచ్ఎం మహేష్ బాబు తెలిపారు. అదేవిధంగా మండలంలోని శృంగ వృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్లస్ టు కేటగిరిలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలలో ఐదుగురికి గాను ఒకరు ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్ఎం కాశీ విశ్వనాథం ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఎర్రగుంటపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బీరువా బహూకరణ

విశాలాంధ్ర - చింతలపూడి : చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చింతలపూడి మండలం కంద్రిక గూడెం గ్రామ వాస్తవ్యులు మాజీ సర్పంచ్ అప్పిరెడ్డి దుర్గారావు జ్ఞాపకార్థం వారి కుమారులు అప్పిరెడ్డి రాము అదే పాఠశాలలో విధులు నిర్వహిస్తూ పాఠశాలకు కావలసిన బీరువాను బహూకరించారు.ఈ కార్యక్రమానికి పి ఆర్ టి యు రాష్ట్ర నాయకులు దయాకర్ ,కృష్ణంరాజు, కీమ్యా, గుగ్గులోతు కృష్ణమూర్తి, కోరం రమేష్, మండల పి.ఆర్.టీ . యు ప్రధాన కార్యదర్శి చుండ్రు రాజేంద్ర, బాణవతు నాగబాబు నాయక్, బాణవతు గోపాల్ కృష్ణ ,పాల్ ఆశ , పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.రాము దాతృత హృదయానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ పి ఎస్ సుధాకర్ ధన్యవాదాలు తెలియజేశారు.

ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్, ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావుకు

కిన్నెర ఉగాది పురస్కారం

ప్రత్యేక అభినందనలు తెలియజేసిన రిజిస్ట్రార్, డీన్‌లు

విశాలాంధ్ర - తాడేపల్లి గూడెం : నేషనల్ ఇనిస్టి ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్ర ప్రదేశ్ (ఏపీ నిట్) ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్.వి.రమణారావు కిన్నెర -శ్రీ విశ్వావసు నామ ఉగాది పురస్కారాన్ని ఇటీవల అందుకున్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు న్యాయ, పోలీస్, రక్షణ, ఇంజినీరింగ్, సాహిత్యం, వైద్యం, నాటకం, నృత్యం, సంగీతం, ప్రసార మాధ్యమం, చిత్రలేఖనం, హస్త కళలు వంటి పలు రంగాల్లో విశేష సేవలందించిన వారిని ఏటా గుర్తించి వారిని అవార్డులతో సత్కరించటం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా ఈ ఏడాదికిగాను సివిల్ ఇంజనీరింగ్ రంగంలో విశిష్ట సేవలందిస్తున్న ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ఆచార్యులు రమణారావును ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో కనుల పండుగగా నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతులమీదుగా రమణారావు కిన్నెర- శ్రీ విశ్వావసు నామ ఉగాది (రావు సాహెబ్ శ్రీ భావరాజు సత్యన్నారాయణ స్మారక) పురస్కారాన్ని అందుకున్నారు. అవార్డు గ్రహీత రమణారావుకు ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్‌లు డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ కార్తీక్, పలువురు విభాగాధిపతులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతలను అంకిత భావంతో నిర్వహించే వారికి గుర్తింపు దానంతట అదే వస్తుందని, అందుకు నిదర్శనమే ఆచార్యులు, డాక్టర్ ఎన్.వి.రమణారావు అని కొనియాడారు. ఈయనను ఆదర్శంగా తీసుకుని సంస్థలోని బోధన, బోధనేతర సిబ్బంది సంస్థ అభివృద్ధి కోసం మరింతగా కృషి చేయాలని వివరించారు.

ఇంటర్ ఫలితాలలో 'శ్రీ అగస్త్య' విద్యార్థుల హవా

విశాలాంధ్ర - కాకినాడ : అనతికాలంలోనే జిల్లాలో తనకంటూ ప్రత్యేకత సాధించిన శ్రీ అగస్త్య విద్యాసంస్థలు ఇంటర్ ఫలితాలలోను తన ప్రత్యేకతను చాటుకుంది. గాంధీనగర్లో లోని శ్రీ అగస్త్య జూనియర్ కళాశాలలో శనివారం సాయంత్రం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని శ్రీ అగస్త్య విద్యాసంస్థల చైర్మన్ దొడ్డిపట్ల నాగేశ్వరరావు (డిఎన్ఆర్) అభినం దించారు. జూనియర్ ఇంటర్ ఎం పిసిలో గురుపల్లి అలేఖ్య 465/470 మార్కులతో కళాశాల టాపర్ నిలవగా, 464 మార్కులతో పోలిశెట్టి సూర్యతేజ, ఎలిపే ప్రైజీ ప్రిస్కిల్లా, చీమలకొండ సాయి షణ్ముఖ్ సాత్విక్ లు రెండవ స్థానంలో నిలిచారని, జి సోమశేఖర్, మారిన చాందినీ అలేఖ్య, సిగిరెడ్డి లాస్య, పట్టాభి రుత్విక్ సుజయ్లు 463 మార్కులు, గరుగు జ్యోష్ఠిత సాహితి 462 మార్కులు, కెవిఎస్ గౌరీ శ్రవణ్, పి లక్ష్మీ ప్రణతి, కెఎస్ఎన్ మణివర్మ, రేపాటి చరణ్‌లు 461 మార్కులు, వెంటూరి తేజష్ వెంకట సాయి, అనిమిని దర్శిత్ 460 మార్కులు సాధించారన్నారు. తమ విద్యార్థులలో 15 మందికి 460 మార్కులకు పైబడి, 36 మందికి 450 మార్కులకు పైబడి సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అలాగే జూనియర్ ఇంటర్ బైపిసిలో సిహెచ్ సత్యవతి, కె ఆహ్లాద 434/440 మార్కులతో టాపర్లుగా నిలవగా, ఎస్ శ్రేయ, జి నిఖితలు 433 మార్కులు, కె లతిక, కె సాయి అభిరామ్‌లు 431 మార్కులు సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపిసిలో కాళ్ల ఛాయ చరిష్మా 988/1000 మార్కులతో టాపర్‌గా నిలవగా, పి హాసిని 982 మార్కులు సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ బైపిసిలో వి సువర్ణ లక్ష్మి 982/1000 మార్కులతో టాపర్గా నిలవగా, జివిస్ సూర్య సంహిత్ 972 మార్కులు సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపిసి మరియు బైపిసిలలో 29 విద్యార్థులు 950 మార్కులకు పైబడి సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. అతి తక్కువ మంది విద్యార్థులతో తమ కళాశాల ఉత్తమ ఫలితాలు సాధిస్తుందన్నారు. ఇంటర్ ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించడానికి కారకులైన అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బందికి చైర్మన్ దొడ్డిపట్ల నాగేశ్వరరావు (డిఎన్ఆర్) అభినందనలు తెలియజేశారు.

ఇంటర్ ఫలితాలలో మెరిసిన ఆణిముత్యం

విశాలాంధ్ర- పాలకోడేరు : పాలకోడేరు మండలం గోరగనమూడి గ్రామానికి చెందిన మాంద్రు వ్యూహిత జాయిసి శనివారం విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో అధిక మార్కులు సాధించింది. ఈమె భీమవరంలోని ఆదిత్య జూనియర్ కళాశాలలో ఎంపీసీ గ్రూపులో చదివి 924 మార్కులు సాధించింది. ఈమె తండ్రి వ్యవసాయదారుడు కాగా తల్లి గృహిణి. తమ గ్రామ విద్యార్థి ఇంటర్లో అత్యధిక మార్కులు సాధించడంతో ఆమెను గ్రామస్తులు అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతి చెందిన సంఘ టన ఏలేశ్వరంలో చోటు చేసుకుంది. ఈ మేరకు స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక గొల్లలమెట్టకు చెందిన బుద్దాని సూరిబాబు (36) శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఇంటి నుండి తన సొంత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కరెంట్ ఆఫీస్ వద్ద తను వెనుక వస్తున్న మరొక బైక్ ఢీకొట్టింది. దీంతో వారు ఇరువురు రోడ్డు పై పడిపోయారు. ఈ ప్రమాదంలో బుద్దాన్ని సూరిబాబు తలకు బలంగా గాయమైంది. హుటా హుటిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా శుక్రవారం రాత్రి 11 గం టలకు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సూరిబాబు లారీ డ్రైవర్గా జీవనం సాగిస్తూ భార్య ఇద్దరు పిల్లలను పోషిస్తున్నాడు. భార్య లక్ష్మీ ప్రసన్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎన్ రామలింగేశ్వర రావు తెలిపారు.

మల్లాడి గృహంలో పలు అంశాలపై చర్చా వేదిక

విశాలాంధ్ర - యానాం : పుదుచ్చేరి ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన మీటింగులో మాట్లాడిన ముఖ్యాంశాలు యానాం శ్రీ భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం కాంపౌండ్ వాల్ నిర్మాణం గురించి చర్చించారు. యానాంలో ప్రధానంగా ఉన్న సమస్య డంపింగ్ యార్డ్. ఈ డంపింగ్ యార్డ్ త్వరలోనే టెంపరరీగా చిన్నబ్బాయి స్థలంలో కొన్ని నెలలు చెత్త డంపింగ్ చేయడం జరుగుతుందని శాశ్వత డంపింగ్ యాడ్ దరియాలతిప్ప వద్ద ఉన్న ఇంజనీరింగ్ కాలేజ్ లోపల ఉండే షెడ్లలో వేసేందుకు ప్రభుత్వం స్థల సేకరణ చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటుందని అది కూడా త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని మల్లాడి కృష్ణారావు తెలియజేశారు. జూన్ ఆరో తారీకు మల్లాడి కృష్ణారావు పుట్టినరోజు సందర్భంగా యానంలో క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా క్రికెట్ మ్యాచ్ టోర్నమెంట్, చెస్ టోర్నమెంట్ లు జరుగుతాయని అలాగే రోడ్ సైడ్ చేపలు అమ్ముకునే చేపల వర్తకులకు గొడుగులు ఇచ్చే కార్యక్రమాన్ని కూడా చేపడతానని తెలియజేశారు.

ఇంటర్ ఫలితాల్లో ఎస్కేఎం విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - పెద్దాపురం : ఎస్కేఎం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపర్చారు. ఈ మేరకు శనివారం కళాశాల యాజమాన్యం విడుదల చేసిన ప్రకటనలో కళాశాల చెందిన మేడిద వేగు ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరంలో (ఎంపీసీ) 944, ఇంటర్ ఫస్ట్ 454 మార్కులతో పట్టణ ప్రథమ స్థాయిలో ఇయర్లో కేశవరపు నందిని (సీఈసీ) నిలిచారన్నారు. అలాగే మొదటి సంవత్సరంలో కురుకూరి ఐశ్వర్య (ఎంపీసీ) 438, బర్రెల దుర్గాదేవి (బైపీసీ) 409, సెంకడ్ ఇయర్లో దాడి మేఘన (ఎంపీసీ) 943, కొమ్మిరెడ్డి నందిని (సీఈసీ) 937 మార్కులతో ఉత్తమ ప్రతిభ కనపర్చినట్లు కళాశాల చైర్మన్ కేవీఆర్ మూర్తి తెలిపారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులను చైర్మన్తో పాటు డైరెక్టర్లు ఎం చక్రం, మధుసూదనరావు, పి ఏసుబాబులు అభినందించారు.

అంబేడ్కర్ జయంతికి అధికారులే ప్రశాంత వాతావరణం కల్పించాలి

– సామాజిక కార్యకర్త చిన్నబాబు

విశాలాంధ్ర - అమలాపురం : ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు ప్రశాంత వాతావరణ కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వ అధికారులు లేనని సామాజిక కార్యకర్త కుంచే చినబాబు డిమాండ్ చేశారు. సాంఘిక విప్లవ కారుడు విద్యావేత్త భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక ఆంక్షలపై పోరాటమే నా మతం అన్న ఏకైక నాయకుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంతిని భారత ప్రభుత్వం ఘనంగా నిర్వహించుకోవాలని సెలవు దినంగా ప్రకటించడం జరిగింది. ఏప్రిల్ 7వ తారీఖు నుండి 14వ తారీకు వరకు విద్య మరియు సామాజిక వారోత్సవాలును జరుపుకోవాలని కోలరాడు స్టేట్ ఆఫ్ అమెరికా గవర్నర్ ఆదేశించారు. ఈ ప్రకటన భారతీయు లందరికే కాదు యావత్ మానవాళికి స్ఫూర్తిదాయకం. ఆయన ఆలోచనలు యావత్ ప్రపంచానికి దిశా నిర్దేశం చేస్తూనే ఉన్నాయి. ఆయన భారత రాజ్యాంగానికి గల ప్రధానం మూలాధారాలు ను 11 దేశాల నుండి స్వీకరించి ఆయన రాసిన రాజ్యాంగం ద్వారా ప్రజలందరికీ ఒకే జాతిగా తయారు చేశారు. మన దేశంలో ఉన్న దాదాపు 140 కోట్లు ప్రజానీకం ఆర్థిక రాజకీయ సంక్షోభంలో పడకుండా ఉండడానికి ఆయన రాసిన రాజ్యాంగం మాత్రమే అన్నారు. ఆ మహనీయుని జయంతి ఉత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో ఏప్రిల్ 14 వచ్చేసరికి సెక్షన్ 30 అమల్లో ఉన్నదని పోలీస్ అధికారులు ప్రకటనలతో ప్రజల్ని ఆందోళనకు గురి చేస్తున్నారని సామాజిక కార్యకర్త కుంచే చినబాబు ఆరోపించారు. జయంతి ఉత్సవాలను అణిచివేయడానికి గత ప్రభుత్వం లోను ప్రస్తుత ప్రభుత్వం లోనూ యాదృచ్ఛికంగా కనబడుతుందన్నారు. ఈ తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సెక్షన్ 30 ఎప్పుడు అమలులోనే ఉంటుందని దాదాపు అన్ని రాష్ట్రాల్లో అయితే ఇది అన్ని నగరాలలో అసాంఘిక కార్యకలాపాలు జరిగినప్పుడు అమలుపరుస్తూ ఉంటారు. మత ఉత్సవాలు జాతర్లు కోడిపందాలు రికార్డింగ్ డాన్సులు అసంకారికలపాలు జరిగినప్పుడు గుర్తింకి రాలేని సెక్షన్ 30 అమల్లో ఉందని అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 వచ్చేసరికి అధికారులు ప్రకటించడం ఎస్సీలను అణచివేయడమే అని ఆయన ఆరోపించారు. ఈ విధానాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అంబేద్కర్ అభిమానులు గ్రామ గ్రామాన జయంతి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా పోలీస్ శాఖ వెసులుబాటు కల్పించి ప్రశాంతమైన వాతావరణం కల్పించవలసిన బాధ్యత అధికారులపై ఉందని చినబాబు పేర్కొన్నారు. అంబేద్కర్ జయంతి ఉత్సవాలలో ఇంత వరకు ఎప్పుడు ఎక్కడ అసాంఘిక కార్యక్రమాలు జరిగిన దాఖలాలు లేవన్నారు. భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్ని ప్రభుత్వ అధికారులు బాధ్యతగా తీసుకోవాలని సామాజిక కార్యకర్త కుంచే చినబాబు విజ్ఞప్తి చేశారు.

వైభవంగా చక్రస్నానం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవాలలో ఆరవ రోజు శనివారం ఆలయాన్ని వేకువ జామునే వివిధ సుగంధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి స్వామికి ప్రత్యేక ఆలంకరణ నిర్వహించారు. కమనీ యంగా చక్ర స్నానం జరిగింది. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్ రావు దంప తులు, ముదునూరు వెంకట రాజు దంపతులు, కాయల జగన్నాథం దంపతులు, పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, సూపరైంట్ పి రాంబాబు వర్మ, మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకట రాజు(గబ్బర్ సింగ్), లొల్ల సర్పంచ్ కాయల జగన్నాథం, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సిఐ విద్యాసాగర్, ఎస్ఐ ఎస్ రాము తన సిబ్బందితో ప్రతిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

16న ఉచిత వైద్య సేవలు

విశాలాంధ్ర - సీతానగరం: ఉచిత మెగా వైద్య శిబిరం సేవలను సద్వినియోగం చేసుకోవలని వైద్య శిబిరం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కదలి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక జీవీకే ఫంక్షన్ హాల్లో కదలి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు 16న సీతానగరం మండలంలో జీవీకే ఫంక్షన్ హాల్లో రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సంబంధించిన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహణ చేయనున్నామన్నారు. కదలి వెంకటేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ 16న ఉదయం 8గంటల నుండి జీవీకే ఫంక్షన్ హాల్లో ఉచిత మెగా వైద్య శిబిరం ద్వారా వైద్య సేవలు అందింజేస్తారన్నారు. శిబిరంలో 16 రకాల వైద్య సేవలు చేస్తారు. నాయకులు పోస్టర్ ఆవిష్కరణ చేశారు.

ఇంటర్ ఫలితాల్లో ఓమ్మంగి ఎస్ఎస్ఎస్ఎన్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ఇం టర్ ఫలితాల్లో మం డలం లోని ఓమ్మంగి ఎస్ఎస్ఎస్ఎన్ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో కర్నీడి మౌనిక, దాడిశెట్టి శ్రీచంద్రకళ ఎంపీసీ 470కి 457 మార్కులు సాధించారు. ఇంటర్ రెండవ సంవత్సరం విద్యార్థిని శరభవరం గ్రామానికి చెందిన అమరాధి శ్రావ్య ఎంపీసీ 1000 మార్కులకు 970 మార్కులు సాధించింది. ఇంటర్ రెండవ సంవత్సరం బైపిసిలో రామిశెట్టి సుభాష్ 895 మార్కులు, సీఈసీలో తోలేటి శ్రీలక్ష్మి 459 మార్కులు, రెండవ సంవత్సరం సీఈసీలో గంట్రెడ్డి పావని 860/1000 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు.

శక్తి యాప్పై అవగాహన కార్యక్రమాలు

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్, ఐపీఎస్, వారి ఆదేశాల మేరకు కాకినాడ జిల్లాలోని వివిధ పాఠశాలలో గుడ్ టచ్-బ్యాడ్ టచ్, మహిళల భద్రతకై రూపొందించిన శక్తి యాప్ గురించి అవగాహన కార్యక్రమలు నిర్వహించారు. ఈనేపథ్యంలో కాకినాడ జిల్లాలో కాకినాడ పట్టణం ఇంద్రపాలెం మౌంట్ కార్మెల్ హైస్కూల్, జగన్నాయకపూర్ బిఆర్ఎంజిసి హెచ్ గర్ల్స్ హైస్కూల్, కొవ్వాడలో జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ శక్తి యాప్ ఁ శక్తి టీమ్స్ పై వివరించారు. శక్తి టీంలో భాగంగా అధ్యాపకులతో కూడిన కోర్ టీం విద్యార్థులతో కూడిన శక్తి వారియర్ టీంను ఏర్పాటు చేశారు. వీటితో పాటు గుడ్ టచ్-బ్యాడ్ టచ్, కెరియర్ పట్ల ఉండాల్సిన బాధ్యత మరియు మహిళలు, బాలికల రక్షణ కోసం అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన టోల్ ఫ్రీ నంబర్ 112 మరియు జిల్లా పోలీస్ వాట్సాప్ నెంబర్ 9494 933 233 సంప్రదించాల్సిందిగా తెలిపారు. కాకినాడ మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ పి రామచంద్రరావు ఆధ్వర్యములో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

30 శాతానికి పరిమితమైన ప్రభుత్వ కళాశాల

విశాలాంధ్ర - జగ్గంపేట : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత 30 శాతానికి పరిమితమైంది. శనివారం ఇంటర్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 279 మంది మొదటి సంవత్సరం పరీక్షలకు హాజరు కాగా వారిలో 85 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణత సాధించడంతో 30 శాతం నమోదైంది. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 142 మంది హాజరు కాగా వారిలో 74 మంది ఉత్తీర్ణత సాధించడంతో 52 శాతం నమోదైంది. మొదటి సంవత్సరంలో గంతకూరి రమ్య 483 మార్కులతో, ద్వితీయ సంవత్సరంలో ప్రభాకర్ 916 మార్కులతో టాపర్స్గా నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ వేమగిరి. శ్రీనివాసరావు తెలిపారు. ఐతే జూనియర్ ఇంటర్ ఉత్తీర్ణత శాతం గతంలో కంటే తగ్గడానికి కారణం అధ్యాపకుల బోధనలోపమని పలువురు తల్లి తండ్రులు పేర్కొంటున్నారు. గతంలో ఉండే ప్రిన్సిఫాల్స్ కళాశాలపై శ్రద్ధ వహించేవారని పలువురు తల్లి తండ్రులు పేర్కొన్నారు.